# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202


తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 320 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | ఆదివారం 22 మార్చి 2026 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 320 22-03-2026 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## దేశవ్యాప్తంగా రంజాన్ సందడి

### శాంతి కోరుతూ మక్కాలో దువా ..!



**విజయవాడ :** నేడు రంజాన్ పండుగను పురస్కరించుకొని .... దేశవ్యాప్తంగా ముస్లింలు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటున్నారు. నెల రోజులపాటు పాటించిన ఉపవాస దీక్షల అనంతరం, అన్ని ప్రాంతాల్లోనూ ఈద్ సందడి నెలకొంది. దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక జామా మసీదులో వేలాదిమంది ముస్లింలు ఒకచోట చేరి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు త్వరగా ముగిసి, శాంతి సౌభ్రాతృత్వాలు నెలకొనాలని ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా దువా చేశారు. ఈ పండుగ వేళ మత సామరస్యం

- మిగతా 2లో..

### శ్రీవారి క్షేత్ర పవిత్రతను కాపాడటమే

## మా ప్రధాన లక్ష్యం...

### తిరుమలలో సీఎం చంద్రబాబు






**తిరుపతి మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడటం, భక్తుల మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమలలో శనివారం ఆయన టీటీడీ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, భక్తుల విశ్వాసాన్ని మరింతగా చూరగొనేలా, పారదర్శకమైన, అత్యున్నత ప్రమాణాలతో కూడిన సేవలు

- తరువాయి 2లో..

## ప్రజానాయకుడు.. శ్రీవారి సేవకుడు


- సీఎం హోదాలో చంద్రబాబుకు తిరుమలలో మహా ద్వార దర్శనానికి అవకాశం
- అయినా క్యూ కాంప్లెక్స్ నుంచే సామాన్యుడిలా వెళ్లి దర్శనం చేసుకుంటున్నారు
- తొలిసారి సీఎం అయినప్పటి నుంచి ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న చంద్రబాబు



**తిరుపతి మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సీఎం చంద్రబాబు కుటుంబానికి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఇలవేల్పు. వేంకటేశ్వర స్వామి పాదాల చెంత పుట్టానని... తనకు పునర్జన్మ లభించింది కూడా వేంకటేశ్వర స్వామి కటాక్షం వల్లేనని చాలా సందర్భాల్లో ముఖ్యమంత్రి చెబుతూనే ఉంటారు. అలాంటి వేంకటేశ్వర స్వామి పట్ల అత్యంత భక్తి శ్రద్ధలతో తాను.. తన కుటుంబం ఉంటుందని సందర్భం వచ్చిన ప్రతిసారీ ముఖ్యమంత్రి భక్తిభావంతో

- తరువాయి 2లో..



## తిరుమలలో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ప్రారంభించిన చంద్రబాబు

**తిరుపతి మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తిరుమల శ్రీవారి భక్తులకు అందించే ప్రసాదాలు, అన్నప్రసాదాల నాణ్యతను మరింత పెంచే దిశగా కీలక అడుగు పడింది. తిరుమలలో స్టేట్ ఫుడ్ లాబరేటరీ, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్మించిన అత్యాధునిక వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించారు. సుమారు రూ.25 కోట్ల వ్యయంతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి, పప్పులు, ఇతర ముడిసరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించి, భక్తులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రసాదాలు అందించాలనే లక్ష్యంతో ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మనవడు దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుమల వచ్చిన సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేశ్, మనవడు దేవాన్ష్ ఉన్నారు. ముఖ్యమంత్రి హోదాలో మహాద్వారం ద్వారా నేరుగా ఆలయ ప్రవేశం చేసే అవకాశం ఉన్నప్పటికీ, తన ఆనవాయతీని కొనసాగిస్తూ సామాన్య భక్తుడిలాగే





- తరువాయి 2లో..

### ఏపీలో రాగల

## మూడురోజులు వానలు




**విజయవాడ, మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఒకవైపు ఉపరితల ఆవర్తనం, మరోవైపు అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రాగల మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా తీర ప్రాంతాలు, రాయలసీమలో ఈదురు గాలులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల దగ్గర ఉండకూడదని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఈదురుగాలుల వల్ల అరటి, మామిడి వంటి తోటల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలు పెరగనున్న నేపథ్యంలో వృద్ధులు, పిల్లలు మధ్యాహ్న సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రస్తుతం మూడు రకాల వాతావరణ పరిస్థితులు రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయి. దక్షిణ అంతర కర్నాటక పరిసరాల్లో సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోంది. గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి

- తరువాయి 2లో..

## నటాంజ్ అణు కేంద్రంపై దాడి

- టెహరాన్, బీరుట్ నగరాలపై ఉధృత దాడులు
- మూడు వారాల్లో 2వేల మందికి పైగా మృతి
- ఇరాన్ చమురు విక్రయాలపై అమెరికా ఆంక్షల ఎత్తివేత
- వాస్తవం కాదన్న ఇరాన్
- పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలు నిలిచిపోవాలి
- జర్మనీ, ఫ్రాన్స్ స్పష్టీకరణ
- ఇరాన్‌లో యుద్ధం ముగించాలనుకుంటున్నామన్న ట్రంప్



టెహరాన్, టెల్ అవీవ్, వాషింగ్టన్ : ఇరాన్‌లోని నటాంజ్ అణు కేంద్రంపై శనివారం దాడి జరిగింది. అధికార ఇరాన్ వార్త సంస్థ కూడా ఈ దాడిని ధృవీకరించింది. అయితే అణు ధార్మికత ముప్పు లేదని వెల్లడించింది. ఈ దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. శనివారం తెల్లవారుజామున

- తరువాయి 2లో..

## ఇరాన్ అధ్యక్షుడితో మాట్లాడిన మోడీ

### పశ్చిమాసియా యుద్ధంపై కీలక చర్చ



**న్యూఢిల్లీ మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌కు ఈద్, నౌరూజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ కాలం పశ్చిమ ఆసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకువస్తుందని ఆశాభావం మోడీ వ్యక్తం చేశారు. ఇరాన్ నాయకుడితో జరిపిన ఫోన్ సంభాషణలో మోడీ ఇరాన్‌లో కీలక మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను ఖండించారు. ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగిస్తాయని నొక్కి చెప్పారు. నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించడం, షిప్పింగ్ మార్గాలు తెరిచి సురక్షితంగా ఉండేలా చూడాలని దాని ప్రాముఖ్యతను మోడీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ మేరకు మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

## రంజాన్ వేళ ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న మంత్రి లోకేష్

- గతేడాది పేద ముస్లీం మైనార్టీ సోదరుడి నివాసంలో మంత్రి ఇఫ్తార్ విందు
- కుటుంబ బాధ్యత తీసుకుని ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చిన మంత్రి లోకేష్
- ఏడాది తిరగకముందే హామీని నెరవేర్చిన మంత్రి

**అమరావతి మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గతేడాది పవిత్ర రంజాన్ సందర్భంగా పేద ముస్లీం మైనార్టీ సోదరుడికి ఇచ్చిన హామీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నెరవేర్చారు. రంజాన్ వేళ మంగళగిరి బస్టాండ్ సమీపంలో ఉండే షేక్ షహెన్నా ఇంటిని

- తరువాయి 2లో..



### విమాన ప్రయాణికులపై

## యుద్ధ ప్రభావం పడనివ్వం

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**అమరావతి మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల ప్రభావం విమానయాన రంగంపై ఉన్నప్పటికీ, ఆ ఆర్థిక భారాన్ని ప్రయాణికులపై పడకుండా

- తరువాయి 2లో..



## పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీలు మినహాయింపు

### మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రంలో పశు సంవర్ధక రంగాన్ని బలోపేతం చేస్తూ పశుపోషకులు, చిన్న రైతులకు పెద్దయెత్తున ఊరటనిచ్చే నిర్ణయం తీసుకున్నామని వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థలు పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు, మేకల పెంపకం కేంద్రాలు, పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక ఫారాలకు బెటర్‌మెంట్ ఛార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీల నుంచి పూర్తిగా మినహాయింపు మంజూరు చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఈ ఫారాలకు భవన అనుమతి, లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు తెలిపారు. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన జిఓ ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నామని

- తరువాయి 2లో..

### తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు

## పిఎంకె పార్టీతో శశికళ పొత్తు



**చెన్నై :** త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో పలు రాజకీయ పార్టీలు పొత్తులు పెట్టుకుని ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నాయి. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఐపీటీఎంఎంకే)కూడా ఈ ఎన్నికల్లో బరిలోకి దిగనుంది. అయితే శశికళ ఈ ఎన్నికల సందర్భంగా పట్టాలి మక్కల్ కచ్చి (పిఎంకె)తో పొత్తు పెట్టుకోనుంది. దీనికోసం ఆమె శనివారం విల్లుపురం జిల్లా తైలపురంలోని పిఎంకె పార్టీ వ్యవస్థాపకుడై రామదాస్‌ని కలిశారు. ఎన్నికల పొత్తు గురించి, కూటమి ఏర్పాటు గురించి సుమారు రెండు గంటలపాటు ఆమె ఆయనతో చర్చించారు. ఎన్నికల పొత్తుకు తాము సిద్ధమని రామదాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ పొత్తు ఇప్పటికే తమిళనాడులో బలమైన ప్రభావాన్ని చూపింది. పలువురు

- తరువాయి 2లో..

## రాష్ట్రంలో మళ్లీ కిరోసిన్ సరఫరా ..!



**అమరావతి మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కేంద్రం కిరోసిన్ కూడా అందించాలని ప్రకటించిందని, త్వరలోనే కిరోసిన్ సరఫరా చేస్తామని మంత్రి నాదెండ్ల తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా గృహ అవసరాలకు సంబంధించిన వంట గ్యాస్ కొరత లేదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. ప్రజల్లో అపోహలు, భయాందోళనలు కలిగించే వారిపై అప్రమత్తంగా ఉండాలని సంబంధిత శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాను మూడు ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హెచ్పీసీఎల్ వంటి ప్రధాన ఆయిల్ కంపెనీలు సప్లయి చేస్తున్నాయన్నారు. సోషల్ మీడియాలో కొందరు కావాలని గ్యాస్ సరఫరా విషయంలో ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా మాట్లాడుతున్నారు. దీనివల్ల ప్రజలు ఆందోళనకు గురై ఎక్కువ బుకింగ్స్ జరుపుతున్నారని మంత్రి నాదెండ్ల తెలిపారు.

**గ్యాస్ కొరతా లేదు....**

గత వారం రోజుల్లో ఇలాంటి అపోహల వల్లనే అధికంగా బుకింగ్స్ జరిగాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని... ముఖ్యంగా గృహ అవసరాలకు ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా సాఫీగా గ్యాస్ సరఫరా చేస్తున్నామన్నారు. వాణిజ్య అవసరాలకు కూడా ప్రస్తుతానికి పెద్ద ఇబ్బందులేవీ లేవన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలు, వసతి గృహాలు, అత్యవసర సర్వీసులకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ వాణిజ్య అవసరాల గ్యాస్ ను సరఫరా చేస్తున్నామన్నారు.

- తరువాయి 2లో..

జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

# దురాక్రమణ వాదం!

ఇరాన్ తరువాత తమ లక్ష్యం క్యూబానే అంటూ అమెరికా అధ్యక్షుడు బెదిరించడం అత్యంత గర్హనీయం. ఒక సర్వసత్తాక సార్వభౌమ దేశంపై ఇలా తెగబడడం సామ్రాజ్యవాదుల దురహంకార, దురాక్రమణ ధోరణికి నిదర్శనం. ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించి ఖమేనీని, అక్కడి ముఖ్య నాయకుల్ని హత్య గావించి గెలిచేశాననుకున్న అమెరికాకు ఇప్పుడు ఇరాన్ ముచ్చెమటలు పోయిస్తోంది. ట్రంప్-నెతన్యాహులు ప్రారంభించిన దురాక్రమణ యుద్ధం దుష్ప్రభావాలు ఇప్పుడు భూగోళాన్ని చుట్టుముట్టాయి. బ్యారెల్ చమురు ధర 120 డాలర్లకు చేరువ కావడమేగాక ప్రధాన చమురు క్షేత్రాల విధ్వంసంతో ఇంధన భద్రత కొరవడుతుందని యావత్ ప్రపంచమూ బెంబేలెత్తుతున్న పరిస్థితి ఏర్పడింది. అమెరికా, ఇజ్రాయిల్‌లలో సైతం ప్రజలు యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. హార్మూజ్ జలసంధి వద్దకు తమ దళాలను పంపడానికి నాటో దేశాలు తిరస్కరించడం, అమెరికాకు ఆయుధాల ఎగుమతికి స్విట్జర్లాండ్ నిరాకరించడం వంటివి అమెరికా శిబిరంలోనే చోటుచేసుకుంటున్నాయి. అయినా అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాద విధ్వంసాన్ని పెంచుతుండడం దుర్మార్గం.

ఇటీవల వెనిజులా అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేసి దారుణానికి పాల్పడిన అమెరికా ఇప్పుడు క్యూబాపై పంజా విసురుతానని బెదిరిస్తోంది. అయితే, అమెరికా విధిస్తున్న ఆంక్షలను ఎదుర్కొంటూనే గత ఏడు దశాబ్దాలుగా క్యూబా సోషలిజం బాటలో ముందుకు సాగుతూనే వుంది. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో బ్రహ్మాండమైన ప్రగతి సాధించింది. దేశ ప్రజలకు అవసరమైన ఆహార ధాన్యాల స్వయంసమృద్ధికి కృషి చేస్తోంది. తన పెట్రోలియం అవసరాల్లో 40 శాతాన్ని మాత్రమే సొంతంగా ఉత్పత్తి చేసి తీర్చుకోగలుగుతోంది. అలాగే విద్యుత్‌ను కూడా సొంతంగా ఉత్పత్తి చేసుకుంటున్నా.. దేశీయ అవసరాలకు అది సరిపోవడం లేదు. ఇటీవల సౌర, పవన విద్యుదుత్పత్తికి ప్రణాళికలు వేసినా అవి పూర్తి స్థాయిలో ఆచరణకు రాలేదు. ఇటువంటి స్థితిలో క్యూబాకు చమురు విక్రయించే లేదా సరఫరా చేసే ఏ దేశంపై అయినా సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జనవరిలో చేసిన హెచ్చరిక చాలా దేశాలను నిలవరించింది. పర్యవసానంగా క్యూబాలో విద్యుత్ సంక్షోభం తీవ్రతరమవుతున్నది. ఈ నెల 16న దేశవ్యాప్తంగా విద్యుత్ కోత ఏర్పడింది. సుమారు కోటి మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గతేడాది డిసెంబర్ ప్రారంభంలో కూడా పశ్చిమ క్యూబాలో భారీ విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గత నాలుగు నెలల్లో క్యూబాకు ఇది మూడో భారీ విద్యుత్ అంతరాయం. సోమవారం విద్యుత్ కోతతో దాదాపు పది వేల మందికి పైగా ప్రజలకు జరగాల్సిన శస్త్ర చికిత్సలను వాయిదా వేయాల్సి వచ్చిందని అధ్యక్షులు డియాజ్ కానెల్ తెలిపారు. చిన్న పిల్లలు చదివే పాఠశాలలపై గాజాలో, ఇరాన్ లో బాంబులు వేసి వేలాదిమందిని బలి తీసుకున్న నరహంతకులకు ఇది బాధ కలిగించకపోవచ్చు కానీ మనసున్న ఏ మనిషినైనా కదిలిస్తుంది. రోగులపట్ల సానుభూతి కలిగిస్తుంది.

విద్యుత్ సంక్షోభంతో క్యూబా ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింటున్నది. సోషలిస్టు వ్యవస్థ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి అమెరికా చేస్తున్న కుయత్నాల్ని అక్కడి ప్రజల సహకారంతో క్యూబా కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం తిప్పికొడుతూ పట్టుదలగా ముందుకు సాగుతోంది. 'క్యూబా ప్రజలపై అమెరికా ఫాసిస్టు ప్రభుత్వం తమ దురాక్రమణను కొనసాగిస్తోంది. ఈ నేరపూరిత, నయా వలసవాద సామ్రాజ్యవాదమే ఈ ప్రాంతంలో, ప్రపంచంలో శాంతికి నిజమైన ఏకైక ముప్పు. 67 ఏళ్లుగా వారు మమ్మల్ని ఓడించలేకపోయారు. ఇకపై కూడా ఓడించలేరు' అన్న దృఢ విశ్వాసంతో కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం పోరాడుతున్నాయి. క్యూబన్ల ధర్మ పోరాటానికి యావత్ ప్రపంచమూ ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు సంఘీభావంగా నిలవాలి. అమెరికా దిగ్బంధాన్ని నిరసించాలి. ఒకప్పుడు అలీన దేశాల కూటమిలో భారత్, క్యూబా లు సమిష్టి కృషితో ప్రపంచ శాంతికి దన్నుగా నిలిచిన చరిత్రను గుర్తు చేసుకోవాలి. నేడున్న కేంద్ర ప్రభుత్వం అమెరికాకు లొంగుబాటుగా వ్యవహరిస్తోంది. అమెరికా యుద్ధ విమానాలను మా భూభాగంలోకి రానివ్వబోమని చిన్న ద్వీప దేశం శ్రీలంక ధైర్యంగా చెప్పగలిగినా భారత ప్రభుత్వం మాత్రం ట్రంప్ దొరకు సలాం కొడుతుండడం సిగ్గుచేటు!

## దేశవ్యాప్తంగా రంజాన్ సందడి.. శాంతి కోరుతూ మక్కాలో దువా ..!

వెల్లివిరిసింది. ప్రభుత్వాలు, స్థానిక యంత్రాంగం ముస్లిం సోదరసోదరీల కోసం అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశాయి. శాంతి, కరుణ, దానగుణానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగ, ప్రజల మధ్య ఐక్యతను మరింత పటిష్టం చేస్తోందని ప్రముఖులు ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా ఉన్న మసీదులు, ఈద్గా వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి.

**తెలుగు రాష్ట్రాల్లో ....**

తెలుగు రాష్ట్రాల్లోనూ రంజాన్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక మక్కా మసీదులో వేలాది మంది ముస్లింలు ఈద్ నమాజ్ ఆచరించారు. ఈ సందర్భంగా పాతబస్తీ పరిసర ప్రాంతాలు జనాల రాకతో కోలాహలంగా మారాయి. అలాగే, విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈద్గా వద్ద భారీ సంఖ్యలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. పరస్పరం ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' తెలుపుకుంటూ పండుగ శుభాకాంక్షలు మార్పిడి చేసుకున్నారు.

## శ్రీవారి క్షేత్ర పవిత్రతను కాపాడటమే మా ప్రధాన లక్ష్యం...

అందించాలని అధికారులను దిశానిర్దేశం చేశారు.

**సాంకేతికతతో సామాన్యులకు పెద్దపీట**

సామాన్య భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. టెక్నాలజీ సహాయంతో భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించి, వారికి సులభంగా, త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించాలని ఆదేశించారు. ఇది భక్తులపై మానసిక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, దర్శన ప్రక్రియలో పారదర్శకతను పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ప్రసాదం నాణ్యతలో రాజీ వద్దు**

శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. ప్రసాదాల తయారీలో వినియోగించే నెయ్యి, ఇతర ముడి సరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ఏర్పాటు చేసిన అత్యాధునిక ల్యాబ్‌ను పటిష్టంగా నిర్వహించాలని, కల్తీకి ఏమాత్రం ఆస్కారం ఇవ్వరాదని స్పష్టం చేశారు. తాను స్వయంగా కొందరు భక్తులను కలిసినప్పుడు వారు ప్రసాదం నాణ్యతపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని, ఆ నమ్మకాన్ని నిరంతరం కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు.

**పేదలకు అండగా సేవలు.. ధర్మప్రచారానికి పెద్దపీట**

"పేదల సేవయే భగవంతుని సేవ" అనే స్ఫూర్తితో టీటీడీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలోని స్విమ్స్, బర్డ్, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ వంటి వైద్య సంస్థల ద్వారా అందిస్తున్న సేవలపై ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. అరుదైన వ్యాధులతో బాధపడే పేద రోగుల చికిత్స కోసం ప్రాణదానం ట్రస్ట్ ద్వారా నెలకు అదనంగా రూ.1 కోటి నిధులను సమకూరుస్తున్నట్లు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. దివంగత ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన అన్నదానం కార్యక్రమాన్ని టీటీడీ పరిధిలోని 57 ఆలయాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నారని, త్వరలోనే మరో 4 ఆలయాల్లో ప్రారంభిస్తామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఇతర ప్రధాన దేవాలయాల్లో కూడా అమలు చేసేలా చూడాలని సీఎం సూచించారు. ధర్మప్రచారంలో భాగంగా టీటీడీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.750 కోట్ల వ్యయంతో 5,000 నూతన ఆలయాల నిర్మాణ ప్రణాళికను ముఖ్యమంత్రి సమీక్షించారు. అంతేకాకుండా, దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ తిరుమల శ్రీవారి ఆలయం తరహాలో ఆలయాలు నిర్మించే ప్రతిపాదనలపై దృష్టి సారించాలని ఆదేశించారు.

**శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకోవాలి**

తిరుమల కొండపై శ్రీవారి సేవకుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు 17.12 లక్షల మంది సేవకులు తమ సేవలను అందించారని, సాధారణ రోజుల్లో 3000 మంది, రద్దీ రోజుల్లో 4000 మంది వరకు సేవకులు భక్తులకు సేవలందిస్తున్నారని అధికారులు సీఎంకు వివరించారు. అన్నదానం, క్యూలైన్ల నిర్వహణ వంటి కీలక విభాగాల్లో వారి సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, టీటీడీ ఉన్నతాధికారులు, తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాయకుడు.. శ్రీవారి సేవకుడు

చెప్పడమే కాదు.. దాన్ని తూచా తప్పకుండా సీఎం చంద్రబాబు ఆచరణలో పెడుతున్నారు. సీఎం హోదాలో ఉన్నవారికి తిరుమలలో మహాద్వార దర్శనం చేసుకునే అవకాశం ఉంటుంది. సీఎంకు ప్రొటోకాల్ ఉంటుంది కాబట్టి... తిరుమలలో మహా ద్వార దర్శనం చేసుకోవచ్చు. కానీ దేవుని ముందు అందరూ సమానమే అనే సూత్రాన్ని సీఎం చంద్రబాబు పాటిస్తారు. అందుకే చంద్రబాబు తిరుమల కొండకు ఎప్పుడు వచ్చినా... క్యూ కాంప్లెక్స్ ద్వారానే శ్రీవారి దర్శనం చేసుకుంటారు. చంద్రబాబు తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇదే విధానాన్ని పాటిస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించే సమయంలో తప్పించి... మిగిలిన సందర్భాల్లో క్యూ కాంప్లెక్స్ ద్వారానే కుటుంబంతో సహా వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

**సామాన్య భక్తుల ఇబ్బందులు తెలుసుకునేందుకు..**

క్యూ కాంప్లెక్స్ మార్గంలో సాధారణ భక్తుల తరహాలోనే శ్రీవారి దర్శనాని వెళ్తూ టీటీడీ ఏర్పాట్లు, భక్తుల ఇబ్బందులు చంద్రబాబు స్వయంగా పరిశీలిస్తారు. క్యూ కాంప్లెక్స్‌లో ప్రసాదం పంపిణీ, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాలు ఎలా ఉన్నాయో స్వయంగా చూస్తారు. లోపాలేమైనా ఉంటే వెంటనే సరిదిద్దాలని టీటీడీకి సూచించేందుకు చంద్రబాబు ఇలా క్యూ కాంప్లెక్స్ ద్వారా దర్శనానికి వెళతారు.

**ఎన్టీఆర్ పెట్టిన ట్రస్ట్..దేవాన్ష్ విరాళం**

ఎన్టీఆర్ హయాంలో తిరుమలలో ఏర్పాటు చేసిన అన్నదానం ట్రస్టు తిరుమల కొండకు వచ్చే భక్తులకు అన్నప్రసాదంతో ఆకలి తీరుస్తూనే ఉంది. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్సులో నిత్యం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతూనే ఉంటుంది. ఈ ట్రస్టుకు తన మనుమడు దేవాన్ష్ పుట్టినప్పటి నుంచి ప్రతి ఏడాది విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్నారు. దేవాన్ష్ పేరుతో అన్నదానం కోసం 12 సార్లు విరాళం అందించారు. మొత్తంగా ఇప్పటి వరకూ రూ.3.40 కోట్లు అన్నదానం కోసం విరాళంగా అందించారు.

## తిరుమలలో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ప్రారంభించిన చంద్రబాబు

వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారానే స్వామివారి దర్శనానికి వెళ్లారు. సీఎం అయిన తొలిసారి నుంచి ఆయన ఇదే పద్ధతిని పాటిస్తున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించగా, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రతి ఏటా మనవడు దేవాన్ష్ పుట్టినరోజున అన్నదాన ట్రస్టుకు విరాళం ఇచ్చే సంప్రదాయాన్ని చంద్రబాబు కుటుంబం కొనసాగిస్తోంది. ఈ ఏడాది కూడా ఒకరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షల విరాళాన్ని అన్నదానం ట్రస్టుకు అందజేశారు. దేవాన్ష్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 12 సార్లు ఈ విరాళాన్ని అందించారు. దర్శనానంతరం సీఎం, ఆయన కుటుంబ సభ్యులు కాలినడకన తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకున్నారు. అక్కడ భోజనం చేస్తున్న భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించి, వారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులతో ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మాడ వీధుల్లో నడుచుకుంటూ వెళుతున్న ముఖ్యమంత్రిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. ఈ క్రమంలో, చంద్రబాబు తన సెక్యూరిటీ ప్రోటోకాల్ ను పక్కనపెట్టి, నేరుగా భక్తుల వద్దకు వెళ్లి వారితో కరచాలనం చేస్తూ, ఫొటోలు దిగుతూ ఆనందం కలిగించారు. ఈ క్రమంలో ఓ భక్తురాలు సీఎంకు కరుంగళి మాలను బహూకరించగా, ఆయన ఆప్యాయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుమలలో అందుతున్న సౌకర్యాలపై సీఎం భక్తులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా లడ్డూ ప్రసాదం నాణ్యత గురించి అడగ్గా, గతంతో పోలిస్తే నాణ్యత చాలా మెరుగుపడిందని, రుచి బాగుందని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. దర్శనం మరింత వేగంగా జరిగేలా చూడాలని కొందరు భక్తులు కోరగా, సీఎం సానుకూలంగా స్పందించారు. భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని, త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ద్వారా శ్రీవారి దర్శనం మరింత సులభతరం, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఏపీలో రాగల మూడురోజులు వానలు

ఉత్తర అంతర కర్నాటక వరకు తమిళనాడు మీదుగా 0.9 కి.మీ ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఉత్తర కోస్తా ఆంధ్ర తీరంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావం ఈరోజు కొంత తగ్గింది.

**ఉత్తర కోస్తా -- యానాం :** ఇవాళ ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా గంటకు 40-60 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయి. ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉంది. రేపు, ఎల్లుండి వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, ఈదురు గాలుల వేగం గంటకు 30-50 కి.మీ వరకు ఉంటుంది.

**దక్షిణ కోస్తాంధ్ర ....**

రాగల మూడు రోజులు ఇక్కడ వాతావరణం దాదాపు ఒకేలా ఉంటుంది. ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చు. గంటకు 30-50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి.

**రాయలసీమ**

ఇవాళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. గంటకు 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి. రేపు తేలికపాటి వర్షాలు కురుస్తాయి. ఎల్లుండి కేవలం ఒకటి లేదా రెండు చోట్ల మాత్రమే తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది. కాగా రాష్ట్రంలో రాగల రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండకపోయినప్పటికీ, ఆ తర్వాత 5 రోజుల్లో ఎండల తీవ్రత గణనీయంగా పెరగనుంది. వర్షాలు తగ్గగానే భానుడు తన ప్రతాపాన్ని చూపించనున్నాడు. క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## నటాంజ్ అణు కేంద్రంపై దాడి

టెహరాన్‌పై భారీగా వైమానిక దాడులు కొనసాగాయని స్థానిక ప్రజలు తెలిపారు. తక్షణ కాల్పుల విరమణ మాత్రమే కాకుండా, యుద్ధాన్ని శాశ్వతంగా, సంపూర్ణంగా, సమగ్రంగా ముగించడానికి చర్యలు తీసుకోవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చి పేర్కొన్నారు. టెహరాన్, బీరుట్ నగరాలపై శనివారం ఇజ్రాయిల్ భీకరంగా దాడులు కొనసాగించింది. గత మూడు వారాలుగా సాగుతున్న ఈ దాడుల్లో ఇప్పటివరకు 2వేలమందికి పైగా మరణించారు. కేవలం లెబనాన్‌లోనే వెయ్యిమందికి పైగా మృతి చెందారు. పది లక్షల మందికి పైగా నిర్వాసితులయ్యారు. బీరుట్‌లోని హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా తాము దాడులు జరుపుతున్నామని ఇజ్రాయిల్ ప్రకటించింది. వచ్చే వారం ఈ దాడులు మరింత గణనీయంగా, ఉధృతంగా మారతాయని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరించారు. మరోవైపు పశ్చిమాసియాకు వేలాదిమంది నావికా బలగాలను అమెరికా పంపుతోంది.

**ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేస్తున్నాం**

యుద్ధం వల్ల స్తంభించిన ఇరాన్ చమురు అమ్మకాలను అనుమతించేందుకు వీలుగా 30రోజుల పాటు ఆంక్షలు రద్దు చేస్తున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. హార్మూజ్ జలసంధిలో నిలిచిపోయిన చమురు ట్యాంకర్లలోని చమురును విక్రయించుకోవడానికి వీలుగా ఇరాన్‌పై గల నిషేధాన్ని ఎత్తివేస్తున్నామని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. రెండు వారాల్లో ఇలా తాత్కాలికంగా అమెరికా ఆంక్షలు ఎత్తివేయడం ఇది మూడవసారి. గతంలో రష్యా చమురుపై కూడా ఆంక్షలను సడలించింది. కాగా ఈ ప్రకటనపై ఇరాన్ వెంటనే స్పందించింది. అమెరికా ప్రకటనని ఖండించింది. ప్రస్తుతం సముద్ర రవాణాలో తమ చమురు నిల్వలేవీ స్తంభించలేదని పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్‌కు సంబంధించి అందుబాటులో వున్న మిగులు చమురు నిల్వలేవీ ఇరాన్ వద్ద లేవని మహారాష్ట్రలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఎక్స్ పోస్టులో తెలిపింది.

**ముందు యుద్ధం ఆగాలి**

హార్మూజ్ జలసంధి ద్వారా నౌకల రవాణా నిలిచిపోవడంతో ముడి చమురు సరఫరా ఆగిపోయి పలు దేశాల్లో ఇబ్బందులు తలెత్తాయి. చమురు ధరలు 50శాతం మేరా పెరిగాయి. ఈ నేపథ్యంలో హార్మూజ్ ద్వారా నౌకల రాకపోకలు సురక్షితంగా జరిగేలాచూడాలని, తమ దేశ నౌకలను అనుమతించాలని 22 దేశాలు ఇరాన్‌ను అభ్యర్థించాయి. అలాగే ఇరాన్ చమురు క్షేత్రాలను, నౌకలను టార్గెట్ చేయడాన్ని ఖండించాయి. యుద్ధ చర్యలు ప్రపంచ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని యుఎఇ విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. దీనిపై 22 దేశాల నేతలు సంతకాలు చేశారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభించడానికి ముందు తమని మాట మాత్రంగానైనా సంప్రదించలేదని ఈ దేశాలు ఇప్పటికే పేర్కొన్నాయి. తాజాగా పరిస్థితులు ఇబ్బందికరంగా మారిన నేపథ్యంలో ఈ దేశాలు ముందుకొచ్చాయి. అయితే వీటన్నింటికంటే ముందుగా యుద్ధం తక్షణమే నిలిచిపోవాలని జర్మనీ, ఫ్రాన్స్ స్పష్టం చేస్తున్నాయి. ముందుగా అది జరిగితేనే తర్వాత ఏ చర్యలైనా చేపట్టడానికి వీలు వుంటుందని పేర్కొంటున్నాయి. ఈ వారాంతంలో ట్రంప్‌తో మాట్లాడనున్నట్లు జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ చెప్పారు. కాగా హార్మూజ్ గుండా జపాన్‌కు సంబంధించిన నౌకలు వెళ్ళడానికి ఇరాన్ అనుమతించడానికి సిద్ధంగా వుందని క్యోడో వార్తా సంస్థ శనివారం తెలిపింది.

**ఇరాన్‌లో లక్ష్యాలు దాదాపుగా సాధించాం : ట్రంప్**

ఇరాన్‌పై సాగించిన యుద్ధంలో తమ లక్ష్యాలను దాదాపుగా సాధించామని ట్రంప్ చెప్పుకున్నారు. ఇరాన్ సైనిక పాటవాన్ని నిర్మూలించడం, అణ్వాయుధాన్ని అభివృద్ధిపరచకుండా అడ్డుకోవడం తమ కీలక లక్ష్యాలని వాటిని నెరవేర్చామని చెప్పారు. అందువల్ల ఇరాన్‌లో యుద్ధాన్ని ముగించే విషయమై ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఇరాన్ విషయంలో ట్రంప్ పలురకాలుగా ప్రకటనలు చేస్తున్నారు. ఒకపక్క పశ్చిమాసియాకు 2500మంది అదనపు నావికులను పంపిస్తున్నారు.మరోవైపు యుద్ధం కోసం అదనంగా నిధులు కావాలని కాంగ్రెస్‌ను కోరుతున్నారు. వీటన్నింటికీ మించి ఇరాన్‌పై ఇక యుద్ధాన్ని ముగిస్తామంటున్నారు. పైగా హార్మూజ్ జలసంధిని పరక్షించుకోవాల్సిన బాధ్యత నాటో దేశాలదేనని, అమెరికాకు దానితో సంబంధం లేదని వ్యాఖ్యానించారు. హిందూ మహా సముద్రంలోని అమెరికా, బ్రిటన్ సంయుక్త సైనిక స్థావరం డిగో గార్సియాను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవడాన్ని బ్రిటన్ ఖండించింది.

## రంజాన్ వేళ ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న మంత్రి లోకేష్

మంత్రి ఆకస్మికంగా సందర్శించారు. అతడి కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి లోకేష్ ఇఫ్తార్ విందు స్వీకరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు సందర్భంగా షహెన్షా నివసిస్తున్న ఇంటిని మంత్రి పరిశీలించి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ పూర్వీకులు నిర్మించిన రేకుల ఇంటి స్థానంలో నూతన ఇల్లు నిర్మించి తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు మంత్రి లోకేష్ ను కోరారు. షహెన్షా కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, నూతన గృహం నిర్మించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఏడాది తిరగకముందే నూతన ఇంటిని నిర్మించి పవిత్ర రంజాన్ మాసంలో ఇచ్చిన హామీని మంత్రి లోకేష్ నిలబెట్టుకున్నారు.

## విమాన ప్రయాణికులపై యుద్ధ ప్రభావం పడనివ్వం

చూసేందుకు కట్టుబడి ఉన్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. యుద్ధం కారణంగా విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలపై ప్రభావం కచ్చితంగా ఉంటుందని, అయితే ఆ భారాన్ని ప్రయాణికులకు బదిలీ చేయకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఈ విషయంపై పౌర విమానయాన, విదేశాంగ, పెట్రోలియం శాఖలతో కలిసి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నామని, విమానయాన సంస్థల నుంచి కూడా నిరంతరం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని ఆయన వివరించారు. దీంతో పాటు ప్రయాణికులకు అనుకూలంగా పలు కొత్త చర్యలను కూడా రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ఇకపై విమానాల్లో 60 శాతం సీట్లను ఎలాంటి అదనపు రుసుము లేకుండా ఉచితంగా ఎంచుకునే వెసులుబాటు కల్పించాలని విమానయాన సంస్థలను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే, క్రీడా పరికరాలు, సంగీత వాయిద్యాలను తరలించే విషయంలో మరింత సరళంగా వ్యవహరించాలని, పెంపుడు జంతువుల ప్రయాణానికి సంబంధించి స్పష్టమైన విధానాలను ప్రవేశపెట్టాలని సూచించారు. విమానాల ఆలస్యం, రద్దు వంటి సందర్భాల్లో ప్రయాణికులకు అందాల్సిన పరిహారం, వారి హక్కులపై అవగాహన పెంచేందుకు ప్రాంతీయ భాషల్లోనూ విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. పశ్చిమాసియాలోని కొన్ని విమానాశ్రయాలు ప్రస్తుతానికి పనిచేయడం లేదని, అయినా కీలక మార్గాల్లో ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రయాణికుల సౌకర్యానికే తమ తొలి ప్రాధాన్యత అని ఆయన పునరుద్ఘాటించారు.

## పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీలు మినహాయింపు

వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులు, చిన్న వ్యవసాయదారులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గి వారి జీవనోపాధి మెరుగుపడుతుందని, మరింత మందికి స్వయం ఉపాధి, సమృద్ధి లభిస్తుందని పేర్కొన్నారు. జూన్‌లో జరిగిన సిఎం కాంక్లేవ్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## పిఎంకె పార్టీతో శశికళ పొత్తు

ప్రత్యర్థులను కలవరపరిచింది. మరిన్ని పార్టీలు మాతో చేరుతాయని భావిస్తున్నాం' అని అన్నారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని తమ కూటమి యోచిస్తున్నదని ఆయన వెల్లడించారు. కాగా శశికళ పార్టీలోనూ, రామదాస్ పార్టీలోనూ అంతర్గత కలహాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇరు పార్టీలు పొత్తుకు సిద్ధపడి ఎన్నికల్లో పోటీ చేయడం విశేషం.

## రాష్ట్రంలో మళ్లీ కిరోసిన్ సరఫరా ..!

క్రమంగా గ్యాస్ సరఫరా మరింత మెరుగయ్యేలా ప్రణాళికాబద్ధంగా సమష్టిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్యాస్ పరిస్థితులను చూస్తూ రాష్ట్రంలో గ్యాస్ ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సమీక్షలు జరపడమేకాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా వెతుకుతుందన్నారు. ఈ నెల 9న ఎసెన్షియల్ కమర్షియల్ యాక్ట్ ను కేంద్రం ప్రకటించిన దగ్గర నుంచి.... రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త పడుతుందన్నారు.

**ఓటీపీ ద్వారానే బుకింగ్స్ -- మంత్రి నాదెండ్ల**

పౌర సరఫరాలు శాఖ ఆధ్వర్యంలో అన్ని వివరాలు తెప్పించుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో గతంలో రోజుకు 1 లక్ష 80 వేల వరకు... రద్దీ సమయాల్లో ఎక్కువగా దాదాపు 1,96,000 వరకు గ్యాస్ బుకింగ్స్ జరిగాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల నుంచి పైప్డ్ నేచురల్ గ్యాస్ (గ్రీ+) కి మారేలా కొత్త పాలసీని సోమవారం సాయంత్రానికి సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. హోటల్స్ తో, రెస్టారెంట్ ప్రతినిధులతో త్వరలో సమావేశం పెడుతున్నామన్నారు. ముందుగా పాఠశాలల్లోని హాస్టల్స్, హాస్పిటల్స్ లో గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. ఆ తరువాత తదితర రంగాలకు వాటి ప్రాధాన్యత ఆధారంగా ఇవ్వబోతున్నామని వివరించారు. ఆన్లైన్ ద్వారానే బుకింగ్స్ చేసుకోవాలి అని.... ఓటీపీ ద్వారా 100 శాతం గ్యాస్ అందేలా చేస్తున్నామన్నారు. ఓటీపీ వస్తేనే బుక్ అయినట్లు గా నిర్ధారణ చెందుతుందన్నారు. బ్లాక్ మార్కెట్ పై మీడియా లో వచ్చిన కథనాల ప్రకారం .... ఉక్కుపాదం మోపుతామన్నారు. "గ్యాస్ ఏజెన్సీలన్నింటికి విజ్ఞప్తి చేస్తున్నాం, ప్రతి ఒక్కరి లిస్ట్ మా దగ్గర ఉన్నాయి. ఎక్కడైనా గ్యాస్ పక్కదారి పడితే చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరిస్తున్నాం. ఇప్పటికే అలాంటి చర్యలకు పాల్పడిన 6 నుంచి 9 ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటున్నాం" అని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు.

**త్వరలోనే కిరోసిన్ సరఫరా -- మంత్రి నాదెండ్ల**

కేంద్రం కిరోసిన్ కూడా అందించాలని ప్రకటించిందని మంత్రి నాదెండ్ల తెలిపారు. త్వరలోనే కిరోసిన్ సరఫరా చేస్తామన్నామన్నారు. ఏపీని గతంలోనే కిరోసిన్ రహితంగా చేశామని... కానీ పరిస్థితుల దఅష్ట్యా వాడకం మళ్లీ మొదలు పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ముందుగా ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో ఇవ్వబోతున్నామన్నారు. జిల్లా స్థాయిలోనూ జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని గ్యాస్ సరఫరా వాస్తవ పరిస్థితిని అందిస్తున్నారని వివరించారు.

# ఆదివాసులందరికీ సింగిల్ విండో విధానం అమలు చేయాలి.

**-ఎస్టీ కమిషన్ చైర్మన్ కి ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకులు వినతిపత్రం..**



**దేవీపట్నం,మార్చి 21(తెలుగు రాష్ట్రం విలేఖరి):** పోలవరం జిల్లా,రంపచోడవరం క్యాంప్ కార్యాలయం నందు ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డికి ఆదివాసీలందరికీ సింగిల్ విండో విధానం తక్షణమే అమలు చేయాలని అలాగే దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా ఆదివాసీ విద్యార్థులు ఉండేందుకు ప్రభుత్వ శిథిల వ్యవస్థల ఉన్న భవనాలు తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి తక్షణమే హాస్టల్ భవనం నిర్మించాలని వినతి పత్రాలు అందజేసామని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 34 తెగల ఆదివాసి ప్రజలు జీవనం సాగిస్తున్నారు మొత్తం జనాభా సుమారు 27.4 లక్షల మంది ఉన్నారు.అందులో ఎటువంటి అక్షరాస్యత లేని జనాభా 51 శాతం మంది ఉన్నారు.అంటే సుమారు 14 లక్షల మంది ఉన్నారు.ఈ ఆదివాసీ ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోసం వివిధ డిపార్ట్మెంట్ అధికారుల వారికి సంబంధిత ధ్రువపత్రాలు అందించాలన్న లేదా బయోమెట్రిక్ థంబ్ వేయాలన్న లేదా చదువుకున్న యువతీ యువకులు ఉద్యోగ ఉపాధి కోసం దరఖాస్తులు చేయాలన్న షెడ్యూల్డ్ ప్రాంతంలో సరైన రోడ్డు సదుపాయం లేకపోవడం మరోవైపు సెల్ ఫోన్ సిగ్నల్స్ అందుబాటులో ఉండకపోవడంతో ఆన్లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవడంలో అమాయక ఆదివాసీ ప్రజలకు నిరక్షరాస్యత,అవగాహన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి షెడ్యూల్డ్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ ప్రజలకు తక్షణమే సింగిల్ విండో విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు.ఈ విషయాలపై ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డి స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,యలగాడ నాగేశ్వరావు, సరస్వతి మొదలైన వారు పాల్గొన్నారు.

# పిసా చట్టంపై అవగాహన సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలి.

**-ఐటీడీఏ మీటింగ్ హాల్ నందు జరిగే సమావేశానికి అందరూ హాజరు కావాలి. -పిసా గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు తెల్లం శేఖర్ పిలుపు..**



**దేవీపట్నం,మార్చి 21(తెలుగు రాష్ట్రం విలేఖరి):** పోలవరం జిల్లా ప్రధాన కేంద్రమైన రంపచోడవరం ఐటీడీఏ మీటింగ్ హాల్ నందు ఈ నేల 24 వ తేదీన పిసా గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులతో పోలవరం జిల్లా కలెక్టర్,రంపచోడవరం ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో పిసా చట్టంపై అవగాహన కల్పించడానికి ముఖ్యఅతిథిగా అడ్వకేట్,డాక్టర్ పి.త్రినాధరావు వస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా పిసా గ్రామసభల నిర్వహణ మరియు లీగల్ విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.కావున ఈ నెల 24వ తేదీన మంగళవారం నాడు ఉదయం 10 గంటలకు రంపచోడవరం ఐటీడీఏ మీటింగ్ హాల్ నందు జరిగే అవగాహన సదస్సుకు గుర్తేడు, మారేడుమిల్లి, రంపచోడవరం,దేవీపట్నం ఈ నాలుగు మండలాలలో సెలెక్ట్ అయిన పిసా గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు మరియు కార్యదర్శులు తప్పనిసరిగా అందరూ హాజరుకావాలని పిసా గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు తెల్లం శేఖర్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యలగాడ నాగేశ్వరరావు,కారం రామన్న దొర మరియు పిసా గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు మరియు కార్యదర్శులు మొదలైన వారు పాల్గొన్నారు.

# ఘనంగా ముస్లిం సోదరులు రంజాన్ ప్రార్థనలు

**మొగల్తూరు,మార్చి 21 (తెలుగు రాష్ట్రం విలేఖరి):**



మండల కేంద్రమైన మొగల్తూరులో ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ పండగను పురస్కరించుకొని గౌరవ అధ్యక్షులు మహబూబ్ అలీ, ప్రెసిడెంట్ జి.ఉస్మాని వైస్ ప్రెసిడెంట్ హుస్సేన్ సాహెబ్ , సెక్రటరీ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ అమీర్ భాషా,ట్రెజరల్ షరీఫ్, మెంబర్స్ వల్లి, అన్వార్, షారుక్ ఖాన్, మస్తాన్, రఫీ సబాన్, నజీర్, రాహుల్, మజీద్ గురువు షాబాద్, హఫీజ్, షహబాజ్, మరియు ముస్లిం సోదరులు ఆధ్వర్యంలో నెల రోజులు ఉపవాసం ఉండి శనివారం రంజాన్ ప్రార్థనలు కమ్యూనిటీ హాల్ వద్ద ఎంత ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ముస్లిం పెద్దలు మాట్లాడుతూ అల్లా దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# పెట్రోల్ కొరతతో చింతపల్లి షాక్...బంకుల వద్ద కిలోమీటర్ల క్యూలు!

**- వదంతులతో ఒక్కసారిగా పెరిగిన డిమాండ్...తెల్లవారుజాము నుంచే వాహనదారుల బారులు.- జీసీసీ బంకులో నిల్వలు తగ్గడంతో ఉద్రిక్తత...ఒకే డిస్పెన్సర్ వద్ద రద్దీ.- క్యాన్లు, బాటిళ్లలో విక్రయాలపై నియంత్రణ కోరుతున్న ప్రజలు.- బంకు వద్ద ట్రాఫిక్ అంతరాయం...యజమాని పర్యవేక్షణలో పరిస్థితి అదుపు.**



**చింతపల్లి, మార్చి 21 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ఇంధన సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్న వదంతులు చింతపల్లి మండలంలో పెట్రోల్ పానిక్‌కు దారి తీశాయి. శనివారం తెల్లవారుజాము నుంచే మండల కేంద్రంలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు భారీగా గుమికూడి బారులు తీరారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు కిలోమీటర్ల మేర వరుసగా నిలబడి గంటల తరబడి ఇంధనం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. సామాజిక మాధ్యమాల్లో "పెట్రోల్ కొరత"పై ప్రచారం వేగంగా వ్యాపించడంతో ప్రజలు ఒక్కసారిగా బంకులపైకి దండెత్తారు. సాధారణ రోజులతో పోలిస్తే డిమాండ్ అనూహ్యంగా పెరగడంతో కొన్నిచోట్ల నిల్వలు తాత్కాలికంగా తగ్గిపోయాయి. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో నడిచే పెట్రోల్ బంకులో ఒక దశలో నిల్వలు తగ్గిపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఒకే డిస్పెన్సర్ వద్ద వందలాది వాహనాలు చేరడంతో క్రమశిక్షణ లోపించి గందరగోళం నెలకొంది. బంకు సిబ్బంది ఒక్కో వాహనానికి పరిమిత పరిమాణంలోనే ఇంధనం అందిస్తూ పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. కొందరు వ్యక్తులు క్యాన్లు, పెద్ద త్రాగునీటి సీసాల్లో కూడా పెట్రోల్ నింపించేందుకు ప్రయత్నించడం గమనార్హం. దీంతో పెద్ద పరిమాణంలో కేన్లు, బాటిళ్లలో ఇంధన విక్రయాలను కట్టడి చేయాలని వాహనదారులు అధికారులను కోరుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం ఇంధనం పూర్తిగా కొరతలో లేకపోయినా సరఫరా ఆలస్యమవుతుందన్న భయంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. "రేపటికి దొరకకపోతే?" అన్న ఆందోళనతో కొందరు వాహనదారులు అప్పుచేసైనా ఫుల్ ట్యాంక్ చేయించుకుంటున్న దృశ్యాలు కనిపించాయి. మరోవైపు, బంకుల నుంచి కొంత ఇంధనం బ్లాక్ మార్కెట్‌కు మళ్లుతోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. బంకుల వద్ద ఒక్కసారిగా పెరిగిన రద్దీ కారణంగా కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంకు యజమాని సిబ్బందితో కలిసి రంగంలోకి దిగి వాహనాలను సర్దుబాటు చేయడంతో పాటు రద్దీని నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో పరిస్థితి కొంతవరకు అదుపులోకి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు మాత్రం పెట్రోల్ సరఫరా యథావిధిగా కొనసాగుతోంది. వదంతులను నమ్మకుండా అవసరమైనంత మాత్రమే ఇంధనం వినియోగించాలి అని సూచించారు. అయినప్పటికీ వదంతుల ప్రభావం పూర్తిగా చల్లారకపోతే బంకుల వద్ద ఈ రద్దీ మరికొన్ని రోజులు కొనసాగవచ్చని స్థానికులు భావిస్తున్నారు.



# చింతపల్లిలో ఈద్ సంబరాల సందడి...మజీద్‌లలో భక్తుల వెల్లువ!

**-నెలవంకతో ముగిసిన ఉపవాస దీక్షలు...ప్రత్యేక ఈద్ నమాజ్‌తో ఆధ్యాత్మిక ఉత్సాహం.- మజీద్-ఏ-క్యూబా, తాజంగి మసీద్‌లలో భారీగా జమాత్...మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు.- జకాత్, ఫిత్రాతో దానధర్మాల పండుగగా ఈద్...సౌభ్రాతృత్వానికి నిదర్శనం.**







**చింతపల్లి, మార్చి 21 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** పవిత్ర రంజాన్ మాసం ముగింపును సూచించే ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని చింతపల్లి మండలంలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరితంగా నిర్వహించారు. నెలరోజులపాటు కఠిన ఉపవాస దీక్షలు, సహరి--ఇఫ్తార్ ఆచారాలతో గడిపిన భక్తులు శుక్రవారం రాత్రి నెలవంక దర్శనంతో ఉపవాసాలను విరమించి శనివారం ఉదయం పండగ నమాజ్ ఆచరించారు. మండల కేంద్రంలోని మజీద్-ఏ-క్యూబాలో నిర్వహించిన ఈద్ నమాజ్‌కు భారీగా భక్తులు తరలివచ్చారు. మసీదు అంతటా ప్రార్థనల నినాదాలు మార్మోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అలాగే తాజంగి మజీద్‌లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో నమాజ్ ఆచరించి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్ నమాజ్‌ను సంప్రదాయానుసారం ఆరు అదనపు తక్బీర్లతో నిర్వహించారు. మజీద్‌లో పురుషులు నమాజ్ ఆచరించగా, మహిళల కోసం ప్రత్యేకంగా పరదా ఏర్పాటు చేసి మజీదు ఆవరణలో ప్రార్థనలు నిర్వహించేలా ముస్లిం కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గ్రామం మరియు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 700 మందికి పైగా భక్తులు పాల్గొనడంతో మజీద్ ప్రాంగణం కిక్కిరిసిపోయి పండుగ వాతావరణం నెలకొంది. ఇమామ్ మొహమ్మద్ సాహిద్ ఖుత్బా సందర్భంగా ఈద్ ప్రాముఖ్యతను వివరించి, జకాత్, ఫిత్రా వంటి దానధర్మాల ద్వారా సమాజంలో సమానత్వం పెంపొందించాలని పిలుపునిచ్చారు. పండుగ అనంతరం భక్తులు పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులకు కొత్త దుస్తులు, మిఠాయిల పంపిణీతో మజీదు పరిసరాలు సందడిగా మారాయి. ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో తాగునీరు, పార్కింగ్, శుభ్రత, భద్రత వంటి ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా సాహెబ్, వైస్ ప్రెసిడెంట్ ఉస్మాన్ భాయ్, మాజీ అధ్యక్షుడు షేక్ భాను, కమిటీ సభ్యులు, యూత్ కమిటీ ప్రతినిధులు మరియు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇది మహిళల ఆస్తి హక్కు సమస్యగానే భావించాలి

**-జగన్ రెడ్డి కుటుంబ సమస్య కాదు.-ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి,**

**రంపచోడవరం, మార్చి 21 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి ):** మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆస్తుల పంపకాలను కేవలం కుటుంబ సమస్యగా కాకుండా మహిళల ఆస్తిహక్కు సమస్యగా భావించాల్సిన అవశ్యతక ఉందని రంప చోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు.. జగన్ మోహన్ రెడ్డి తండ్రి వైఎస్సార్ పాలనలో రూ.43 వేల కోట్లు కలిగిన జగన్... చట్ట ప్రకారం తల్లి, చెల్లికి రెండు భాగాలు ఎందుకు ఇవ్వటం లేదని తమ ఆస్తి హక్కుకు రక్షణ ఉండాలంటే మహిళా లోకం జగన్ ను నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు.జగన్ ను ఆవహించి ఉన్న ధన పిశాచాన్ని వదలగొట్టకపోతే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఉంటుందా? అని ప్రశ్నించారు. ఉచ్చ నీచాలు మరిచిన ధన పిశాచికి రాజకీయాల్లో ఉండేందుకు అర్హత లేదన్నారు. సునీతకు అండగా నిలిచి మహిళల ధన, మాన, ప్రాణాల్ని, ఆస్తి హక్కులను రక్షించుకోవాలని కోరారు.తల్లివి, చెల్లిని గౌరవించే భారతీయ సంప్రదాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.స్వంత చెల్లికన్నా ... బాబాయ్ ని నరికి నరికి చంపించిన అవినాష్ ఎందుకు ఎక్కువ అయ్యాడు? ఒకసారి ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.రక్తపు మడుగును క్లీన్ చేయించి సాక్ష్యాధారాల్ని అవినాష్ ఎందుకు ధ్వంసం చేయించాడో,సాక్షాధారాలను ధ్వంసం చేయడం ఐపీసీ 301 ప్రకారం హత్యానేరంతో సమానం అని ఎంపీకి తెలియాదా? అని మండిపడ్డారు.అవినాష్ ను రక్షించకపోతే తాడేపల్లి ప్యాలెస్ ఫోన్ల గుట్టు రట్టు చేస్తాడని భయమా? అని ప్రశ్నించారు. టీడీపీ బూచి చూపి ప్రజల్ని ఎల్లకాలం మోసం చేయడము సాధ్యమయ్యే పనికాదని ప్రజలు గమనిస్తున్నారన్నారు.న్యాయస్థుడైతే చెల్లెళ్లు పరాయి గడప ఎందుకు తొక్కుతారు? అని ప్రశ్న సంధించారు.ఎవరైనా సరే బాధిత మహిళలకు అండగా నిలిచిన చరిత్ర టీడీపీదే అన్నారు ప్రజలు ఇచ్చిన



అధికారాన్ని సొంత కేసులు, అక్రమ ఆస్తుల కోసం తాకట్టు పెట్టిన చరిత్ర జగన్ ది కాదా? అన్నారు.తల్లికి, చెల్లికి న్యాయం చేయని వ్యక్తి ప్రజలకు ఏం న్యాయం చేస్తాడో అర్థం కావడం లేదన్నారు.2004 లో తన ఆస్తి రూ.1.74 కోట్లు అని జగన్ ఆదాయపు పన్ను శాఖకు చూపించారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని రూ.43 వేల కోట్లు అక్రమార్జన చేశాడని సీబీఐ న్యాయస్థానంలో ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. తన పాలనలో ఒక్క మద్యం కుంభకోణంలోనే రూ.3,500 కోట్ల అక్రమార్జన చేసినట్టు సిట్ నిర్ధారించింది. విషపూరిత మద్యం వల్ల 30 వేల మంది మహిళల మాంగళ్యాలు మంటగలిసాయి. తన పాలనలో ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజా, డ్రగ్స్ మాఫియా ద్వారా వేల కోట్లు అక్రమార్జన చేశాడు. అతి తక్కువ కాలంలో లక్షల కోట్ల ఆస్తులకు జగన్ అధిపతి ఎలా అయ్యారు? న్యాయంగా సంపాదించడం తప్పు కాదు. కానీ ఆర్థిక ఉగ్రవాది, టెర్రరిస్ట్ కన్నా ప్రమాదం అని న్యాయ కోవిదులు చెప్పారు. ధనార్జన తప్పు కాదు కానీ ధన పిశాచం సమాజాన్నే అల్లకల్లోలం చేస్తుంది. జగన్ ధన పిశాచి అయ్యాడు. తన పాలన ఘోరాలు, నేరాల మయం అయింది. ఇలాంటి వారికి రాజకీయాల్లో ఉండే అర్హత ఉన్నదా ప్రజలు ఆలోచించాలి. కుల, మత ప్రాంతీయ తత్వాలు రెచ్చగొట్టి కుతంత్రపు వాదనలతో ప్రజలను మోసం చేస్తున్నాడు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తల్లి చెప్పింది తప్పు అంట. చెల్లెళ్లు చెబుతున్నది తప్పంట. సీబీఐ ఛార్జ్ షీట్ తప్పంట. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ కూడా తప్పంట. తన నేరాలు, ఘోరాలకు 11 సీట్లకే పరిమితం చేసిన ప్రజలది కూడా తప్పంట. జగన్, అవినాష్ చెప్పేదే నిజం అని ప్రజలు నమ్మాలంట. ప్రజల విజ్ఞత పట్ల జగన్కు ఎంత చులకన భావన ఉందో ఈ ధోరణి రుజువు చేస్తోంది. ఊరంత ఒకదారి అయితే ఉలిపికట్టుది మరోకదారి అన్న చందంగా జగన్ సైకో ముఠా తీరు లేదా?హత్యారాజకీయాలకు వ్యతిరేకంగా, శాంతియుత పులివెందుల కోసం, ఒంటరిగా ధైర్యంగా న్యాయపోరాటం చేస్తున్న డాక్టర్ సునీతకు మహిళా లోకం, ప్రజాస్వామ్య వాదులు, ప్రజలు అండగా నిలవాలి. నేరస్థుల్ని చట్టం ముందు నిలబెట్టాలి. రాష్ట్రంలో ప్రజల ధన, మాన, ప్రాణాలు, ఆస్తులను కాపాడుకోవాలని ఆమె కోరారు.






తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
ఆదివారం 22 మార్చి 2026

# వ్యవసాయ కార్మిక సంఘం 30వ రాష్ట్ర మహాసభలు

## -జయప్రదం చేయాలి మాజీ ఎమ్మెల్సీ ఐ.వి. పిలుపు:




**అమలాపురం, మార్చి 21తెలుగు రాష్ట్రం న్యూస్**

భూమి, ఉపాధి, సామాజిక న్యాయం లక్ష్యాలుగా నిరంతరం పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 30వ రాష్ట్ర మహాసభలు ఈ ఏడాది మే 6, 7, 8 తేదీల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శనివారం అమలాపురంలోని యుటిఎఫ్ హోమ్‌లో జరిగిన సమావేశంలో ఈ మహాసభల నిర్వహణ కోసం భారీ ఆహ్వాన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దళాల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మహాసభల ప్రాముఖ్యతను వివరించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు మహాసభల జయప్రదానికి పలు సూచనలు చేశారు.ఆహ్వాన సంఘం కమిటీ వివరాలు:మహాసభల విజయవంతం కోసం కింది ప్రముఖులతో కమిటీని ఏర్పాటు చేశారు:అధ్యక్షులు: మాజీ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు (ఐ.వి.)గౌరవ అధ్యక్షులు: రావణం వేణుగోపాల్ (సి.వి. రామన్ విద్యాసంస్థల అధినేత)విశిష్ట అతిథి: గోపిమూర్తి (గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ)ప్రధాన కార్యదర్శి: కారెం వెంకటేశ్వరరావుకోశాధికారి (ట్రెజరర్): కె. శంకర్ కుమార్పేట్రన్స్: సుధా గణపతి, సప్ప నాగేశ్వరరావు, జంగా బాబురావు, డాక్టర్ చల్లా రవికుమార్, డి.వి. రాఘవులు, జిల్లా అధ్యక్షులు జి.వి. రమణ, కార్యదర్శి ఎన్.టి.వి. సుబ్బారావు, గౌరవాధ్యక్షులు పెంకే వెంకటేశ్వరరావు, ఏ. రవి, శ్రీధర్ మరియు ఇతర ప్రముఖులు.ముఖ్య నాయకుల ప్రసంగం:ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఇళ్ళ వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు రావణం వేణుగోపాల్ మాట్లాడుతూ, అమలాపురంలో ఈ మహాసభలు నిర్వహించడం జిల్లాకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. 1934లో నెల్లూరు జిల్లా అలగానిపాడులో పుచ్చలపల్లి సుందరయ్య స్థాపించిన ఈ సంఘానికి ఘనమైన చరిత్ర ఉందని, గుంటూరు బాపనయ్య, చౌదరి తేజేశ్వరరావు వంటి నాయకులు దీనిని బలోపేతం చేశారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని, పేదల భూములను సేకరించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పాల్గొన్న ప్రముఖులు:ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, కాకినాడ జిల్లా నాయకులు కె.ఎస్. శ్రీనివాస్, పి. ఈశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీ దుర్గాప్రసాద్, ఎన్. బలరాం, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, జిల్లా ట్రెజరర్ పి. అమూల్య, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు బి. ఎస్తేరు రాణి, మలకా సుభాషిణి, ఐద్వా నాయకులు సుశీల, దైవకృప, ఆదిలక్ష్మి, కౌలు రైతు సంఘం కార్యదర్శి పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, దాడి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో రాష్ట్రవ్యాప్త వ్యవసాయ కార్మికుల సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు నాయకులు తెలిపారు. జిల్లాలోని అభ్యుదయవాదులు, మేధావులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.




# సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పినిపే శ్రీకాంత్



**అమలాపురం మార్చ్ 21 తెలుగు రాష్ట్రం న్యూస్**

గుంటూరులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గనికి సంబంధించిన పలు కీలక అంశాలపైన మరియు నియోజవర్గం లో జరుగుతున్న కమిటీలు నిర్మాణాల గురించి సజ్జల రామకృష్ణ రెడ్డి తో చర్చించిన అమలాపురం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ .ఈ కార్యక్రమంలో ఆయన వెంట అమలాపురం నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు దూడల ఫణి ,కుమ్మరి అభి ఉన్నారు...

# వెనుక నుండి ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి





**పి. గన్నవరం మార్చి 21 (తెలుగు రాష్ట్ర విలేకరి )**

ఊడిమూడి గ్రామం చెందిన విల్లా నాగేశ్వరరావు (65) పొలం పని ముగించుకుని సైకిల్ పై వస్తూ ఏటిగాట్టు ర్యాంపు వద్ద సైకిల్ దిగి పైకి నడుస్తుండగా ఊడిమూడి లంక నుండీ ఎర్రమట్టి తరలిస్తున్న లారీ వెనుక నుండీ ఆయనను ఢీకొన్నది. నాగేశ్వరరావు అక్కడికి అక్కడే మృతి చెందాడు.ఈయనకు ఇద్దరు కుమారులు ఇద్దరు వ్యవసాయం చేసుకుంటూ తమ జీవనం కొనసాగిస్తున్నారు.

# పెళ్లిళ్ల వెంకన్న కళ్యాణ మహోత్సవ వేడుకలు ప్రారంభం




**అమలాపురం మార్చ్ 21 తెలుగు రాష్ట్ర న్యూస్**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణం లో పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవ వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ చైర్మన్ కంచి పల్లి అబ్బులు ఆలయ కార్యనిర్వహణాధికారి పివిపి సత్యనారాయణ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మార్చి 28 శనివారం ఉదయం 9: 38 నిమిషాలకు స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు మార్చి 29 ఆదివారం ఉదయం తీర్థం మధ్యాహ్నం రెండు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు మూడు గంటల నుంచి రథోత్సవం నిర్వహిస్తామని అలాగే మార్చి 30 సోమవారం సాయంత్రం 6 గంటలకు పొన్నవాహన గ్రామోత్సవం మార్చి 31 మంగళవారం మధ్యాహ్నం నాలుగు గంటలకు పండిత సత్కారాలు రాత్రి శాసవాహనంపై తెప్పోత్సవం అనంతరం అశ్వగంధర్వ వాహన గ్రామోత్సవం జరుగుతాయని వెల్లడించారు ఏప్రిల్ ఒకటి బుధవారం సాయంత్రం హనుమంత వాహన గ్రామోత్సవం ఏప్రిల్ 2 గురువారం ఉదయం 3 గంటలకు పూర్ణాహుతి చక్రస్నానం నిర్వహిస్తారని ఏప్రిల్ 3 శుక్రవారం స్వామివారి అమ్మవార్లకు ఉయ్యాల సేవ ఉత్సవం సాయంత్రం ఐదు గంటలకు భజన కోలాటం తదుపరి తోలుబొమ్మలాటతో ఉత్సవాలు ముగుస్తాయని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమాలు లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలందరూ ఈ ఉత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని చైర్మన్ కంచిపల్లి అబ్బులు కార్య నిర్వహణ అధికారి కోరారు ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# పేకాట శిబిరంపై దాడి చేసిన ఎస్సై శేఖర్ బాబు




**అమలాపురం మార్చ్ 21 తెలుగు రాష్ట్రం న్యూస్**

అమలాపురం రూరల్ కామనగరు గ్రామ శివారులో జూద కార్యక్రమాలపై అమలాపురం రూరల్ ఎస్సై శేఖర్ బాబు ఆధ్వర్యంలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు జూదగాలను పట్టుకోవడంతోపాటు 52 పేకాటకార్డులతోపాటు 4,150 నగదు స్వాధీనం చేసుకున్నారు

# కొడిమ వారి పెళ్లి వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

**ఎటపాక , మార్చి 21 ( తెలుగు రాష్ట్రం విలేఖరి ):**

మండల కేంద్రంలోని బొజ్జిగుప్ప గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఊకె ముత్తయ్య , రమేష్ ల బామ్మర్ది కొడిమ రమేష్ వివాహ వేడుక దుమ్ముగూడెం మండలం సింగారం గ్రామంలో శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ఎటపాక మండల తెలుగు తమ్ముళ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు ముప్వ శ్రీనివాస్ , సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు , డాక్టర్ సత్యనారాయణ , గోసుల వీర్రాజు , అనుగోజు మురళి , అలవాల ముఖేష్ , ఊకె ముత్తయ్య , సతీష్ , ధర్మ , తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అందరికీ రంజాన్ శుభాకాంక్షలు

## -ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



**పెడన తెలుగు రాష్ట్రం విలేఖరి మార్చి 21**

ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ పురస్కరించుకొని ముస్లిం సోదర సోదరీమణులకు ముస్లిం కుటుంబాల వారికి పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం రంజాన్ పండుగ నేపథ్యంలో పెడన- గుడివాడ రహదారిలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.అల్లాహ్ కరుణ ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తూ... రంజాన్ ముబారక్ తెలిపారు. నియమ నిబంధనలతో ముస్లిం సోదరులు చేసిన రంజాన్ ఉపవాస దీక్షలు వారికి, వారి ఆయురారోగ్య, ఐశ్వర్యాలను ప్రసాధించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు.

# రోహిణి తల్లి పిల్లల ఆసుపత్రి ఆసుపత్రి వారిచే ఉచిత వైద్య శిబిరం..



**అల్లవరం, మార్చి21, (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

మండల పరిధిలోని బోడసకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో రోహిణి తల్లి పిల్లల ఆసుపత్రి వైద్య నిపుణులు డా.వి.ఎస్.ఎస్ మూర్తి, గర్భిణీ స్త్రీల వైద్య నిపుణులు డా. వి.శారద ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ మా గ్రామంలో రోహిణి ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరానికి వచ్చినసుమారు 150 మందికి అవసరమైన పరీక్షల నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. బోడసకుర్రులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన రోహిణి ఆసుపత్రి వైద్యులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలియజేశారు. తెలియజేస్తున్నాను ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు చింతం శ్రీను, పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబు, బిల్లు కలెక్టర్ ఇళ్ల వినాయక రావు, రొక్కాల నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ మొయిల గణపతి, దొమ్మేటి రాధాకృష్ణ, ముత్యాల బాబి, పంచాయతీ సిబ్బంది ,ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

# 140 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

## -వాణిజ్య సంస్థలపై ఆకస్మిక దాడులు-కాకినాడ ,పెద్దాపురం డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో తనిఖీల్లో పాల్గొన్న ఆర్డీవో తహసిల్దార్లు



**కాకినాడ, మార్చి 21 ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి ):**

కొంత మంది వాణిజ్య సంస్థల యజమానులు డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నారనే సమాచారంతో జిల్లా జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా వ్యాప్తంగా శు క్రవారం సంబంధిత ఆర్డీవో లు,పలు వాణిజ్య సంస్థలను తహసీల్దార్ లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఇందులో భాగంగా కాకినాడ డివిజన్ లో వివిధ సంస్థల నుంచి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 80 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లిబాబు తెలిపారు. అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించిన వ్యక్తుల పై కేసులు నమోదు చేసి అత్యవసర వస్తువుల చట్టం సెక్షన్ 6ఏ కింద చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.పెద్దాపురం డివిజన్లో సుమారు 60 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ తనిఖీల్లో ఆర్డీవో ఎస్. మల్లిబాబు తో పాటు ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ హరీష్ కి ఆహ్వాన పత్రికను అందజేసిన ఏపీడబ్ల్యూజేఎఫ్



**అమలాపురం మార్చ్ 21 తెలుగు రాష్ట్రం న్యూస్**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణం లో జరిగే ఏపీడబ్ల్యూజేఎఫ్ మహాసభలకు హాజరు కావాలని ఎంపీ హరీష్ మాధుర్ ను కలిసి ఆహ్వాన పత్రికను అందించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సభ్యులు

## పౌర సరఫరాల అధికారులు దాడులు...

### భారీగా పిడీఎస్ బియ్యం పట్టివేత



**కాకినాడ,ఫిబ్రవరి 21 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**
గత కొంతకాలంగా జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా పెరిగిపోయింది. కొందరు కూటమి పెద్దలు వైసిపి నేతలతో కలిపి బియ్యాన్ని సరిహద్దులు దాటించేస్తున్నారు.అధికారులు దాడులు జరుపుతున్నప్పటికీ ఎక్కడ పట్టు పడడం లేదు. ఇటీవల పౌరసరఫరాలు, రెవిన్యూ, విజిలెన్స్ అధికారులు జగ్గంపేట మండలం రాజపుడి లో దాడులు జరిపి పైనుంచి వచ్చిన ఒత్తిళ్ళతో ఏమీ లేదని బయటికి వచ్చేసారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది .బియ్యం పక్కదారి పట్టడం పై ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు రోజుల క్రితం పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాకు వచ్చారు. ఎక్కడ పర్యటించారో తెలియదు. అధికారులతో మాట్లాడి వెళ్లారు. అన్నవరం దర్శించుకున్నారు. ఆయన వెళ్లిన రెండు రోజులకే పౌరసరఫరాల శాఖ గుట్టు చప్పుడు కాకుండా దాడులు చేసింది. ఐదు లారీలలో 5600 బస్తాలతో కూడిన 140.990 మెట్రిక్ టన్నుల బియ్యంని పట్టుకున్నారు.పోర్టు వద్దే వీటిని పట్టుకోవడం విశేషం. డిఎస్ఓ సత్యనారాయణరాజు బృందం వీటిని సీజ్ చేసింది. అనంతరం కలెక్టర్ షామ్మోహన్ అనుమతితో బియ్యం శాంపిల్స్ ల్యాబ్ కు పంపారు. అవి పిడిఎస్ గా నిర్ధారణయ్యాయని డిఎస్ఓ తెలిపారు. ల్యాబ్ నుంచి రిపోర్ట్ వచ్చేవరకు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు .శనివారం డిఎస్ఓ స్వయంగా ఈ బియ్యం పట్టుకున్న విషయాన్ని ప్రకటించారు. మరోపక్క జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శనివారం పోర్టు వద్ద భారీగా తనిఖీలు నిర్వహించారు. పోర్టు వద్ద లారీలు ,గోడౌన్ లు చెక్ పోస్టుల్లో ఆయన తనిఖీలు జరిగాయి. మరోసారి జిల్లాలో అధికారుల దాడులు పెరిగాయి. అక్రమంగా రేషన్ బియ్యం తరలిపోకుండా నిఘా పెట్టసరు.అయితే రేషన్ బియ్యం వ్యాపారంలో ఉన్న కూటమికే చెందిన నాయకులు ఒత్తిడి తెచ్చే అవకాశం ఉందని కూడా అధికారులు అంగీకరిస్తున్నారు.

## జి జి యు పై విద్యార్థుల నిరసనలు

### - ఫీజు వసూళ్లకు యాజమాన్యం బెదిరింపులు - హాల్ టికెట్లపై నిబంధనలు - అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఎస్.ఎఫ్.ఐ ఆగ్రహం




**రాజమహేంద్రవరం, మార్చ్ 21: ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి )**
గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. యూనివర్సిటీ యాజమాన్యం చేపడుతున్న విధానాల వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపిస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.తూర్పుగోదావరి జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ శ్యామల సెంటర్‌లోని కార్యాలయంలో సోమవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా అధ్యక్షుడు వై. భాస్కర్, కార్యదర్శి ఎన్. రాజా మాట్లాడారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో, యాజమాన్యం బలవంతంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు వసూలు చేస్తోందని ఆరోపించారు.“ఫీజులు చెల్లించకపోతే హాల్ టికెట్లు ఇవ్వబోమని విద్యార్థులను బెదిరిస్తూ ఈరోజు మధ్యాహ్నం 3 గంటల వరకు వసూళ్లు కొనసాగించారు. ఇది పూర్తిగా అన్యాయమైన చర్య” అని వారు పేర్కొన్నారు.ఈ సమస్యపై ఇప్పటికే అనేక సార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల యాజమాన్యం మరింత దురుసుగా వ్యవహరిస్తోందని అన్నారు.గోదావరి గ్లోబల్ యూనివర్సిటీపై తక్షణమే విచారణ కమిటీ ఏర్పాటు చేసి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అవసరమైతే యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరింది. ఇకపై కూడా సమస్యను పట్టించుకోకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు, దీక్షలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కనక, జ్యోతి, కార్తిక్, సౌమ్య, సాహితి తదితరులు పాల్గొన్నారు.

## పండు వారి గూడెంలో సీత రాముల విగ్రహ ప్రతిష్ట ..

**జీలుగుమిల్లి, .( తెలుగు రాష్ట్రం ప్రతినిధి)**



శ్రీరాముని జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని గిరిజనులు తమ సంస్కృతి సాంప్రదాయాలను నిలుపుకుంటూ హిందూ ధర్మ సంస్కృతికి ప్రతీకగా ఆలయాలు నిర్మాణం జరుగుతుందని ఆర్ఎస్ఎస్ ప్రముఖ వేదుల జనార్దన్ రావు పేర్కొన్నారు. మండలంలోని పండువారి గూడెంలో గిరిజనులచే శ్రీ సీతారాముల ఆలయం పునప్రతిష్ట రాతి విగ్రహాల యొక్క పున ప్రతిష్ట జరిగినాయి. శ్రీ సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయుడువినాయకుని యొక్క రాతి విగ్రహాలను ఎంపీటీసీ సున్నం సురేష్ వారి ధర్మపత్ని గ్రామ సర్పంచ్ సున్నం ఉషారాణి దంపతులు దేవాలయానికి సమర్పించగా, వాటికి ప్రాణప్రతిష్ట పోసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యజ్ఞలు, హోమాలు ఋ త్వికులు జటావల్లభు ల రవికుమార్ నేతృత్వంలో వేదమంత్రోచ్చరణలతో దేవాలయం విగ్రహాలు ప్రతిష్ట మహోత్సవం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఎంపీటీసీ సున్నం సురేష్, గ్రామ సర్పంచ్ సున్నం ఉషారాణి, వంకవారి గూడెం గ్రామ సర్పంచ్ కుంజా పార్వతి, కుంజా చిన్న రాముడు, పండు దుర్గారావు, బుద్దుల మంగ రాజు, కూరం దుర్గారావు, కుంజా శ్రీరామమూర్తి, కుంజా వెంకటేశ్వరరావు, పండుబాబు రావు ఊకా సూర్య చంద్ర రావు, ఎస్ఎస్ఎఫ్ ధర్మా విస్తరాక్ బొంతు రామకృష్ణ, కుంజ అజయ్ గ్రామస్తులు పాల్గొన్నారు..

## ఉపాధి హామీ కూలీల సమస్యలు త్వరలో పరిష్కారం: ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం రూరల్, మార్చ్ 21: ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి )**
కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడానికి కట్టుబడి ఉందని, ఉపాధి హామీ కూలీల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.ఈరోజు ఉదయం కోలమూరు పంచాయతీ పరిధిలోని రాయుడుపాకలలో ఉపాధి హామీ కూలీల సమస్యలను స్థానిక నాయకులు పిన్నమరెడ్డి ఈశ్వరుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా కూలీలను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు.కూలీలు మాట్లాడుతూ ఐరిస్ ద్వారా హాజరు నమోదు చేయడానికి ప్రయత్నించినా సర్వర్ స్పందించకపోవడం వల్ల పని చేసిన రోజులకు మస్టర్లు నమోదు కావడం లేదని తెలిపారు. దీనివల్ల వారికి వేతనాలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు.ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే గోరంట్ల, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఐరిస్ పని చేయని వారికి ప్రత్యామ్నాయంగా బయోమెట్రిక్ విధానం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేట్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో యువతకు ఉద్యోగ అవకాశాలు : ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ మార్చి 21 ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి ) :**
అనకాపల్లి జిల్లా నక్కపల్లి బంగారయ్య పేట నందు దేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేట్ స్టీల్ ప్లాంట్ ఆర్సిలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంయుక్త ప్రాజెక్ట్ ఏర్పాటుతో యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.అనకాపల్లి జిల్లా బంగారయ్యపేట నందు దేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై పెద్ద మార్కెట్ నందు నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు కరపత్రాలను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ యువత ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి ముందు అడుగు వేస్తుందని, కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుపై గట్టి భరోసా కనిపిస్తోందిని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, ఇప్పటికే 6,28,347 ఉద్యోగాలను అందించి యువతలో కొత్త వెలుగులు నింపిందిని, రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాలలో అద్భుతమైన ప్రగతిని సాధిస్తూ, యువతకు భరోసా నిచ్చే విధంగా భారీ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని, నేడు అనకాపల్లి జిల్లా నక్కపల్లి బంగారయ్య పేట నందు ఆర్సిలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో యువతుకు భారీ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కొండబాబు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, యెనిమిరెడ్డి మాలకొండయ్య, బచ్చు శేఖర్, అట్ల సత్యనారాయణ, గాది శివరామకృష్ణ, చింతలపూడి రవి, రెడ్డనం సత్తిబాబు, అమలకంటి బలరాం, కోడూరు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అల్లుకి ‘మద్దూరి అన్నపూర్ణయ్య” పురస్కారం పట్ల హర్షం

**కోరుకొండ మార్చి 21(తెలుగు రాష్ట్రం విలేఖరి)**



స్వాతంత్ర సమరయోధులు స్వర్గీయ మద్దూరి అన్నపూర్ణయ్య 127వ జయంతి ఉత్సవాలలో అన్నపూర్ణయ్య పురస్కారాన్ని రాజకీయ ఆధ్యాత్మికవేత అల్లు జయశ్రీ రామకుమార్ కి ఇవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కోరుకొండ మండలంలోని పలువురు అన్నపూర్ణయ్య పురస్కార గ్రహీత అల్లుని కలిసి అభినందనలు తెలియజేశారు. జయశ్రీ పశ్చిమ గోనగూడెం సర్పంచ్ గా కొనసాగుతూ, భార్యాభర్తలు ఇరువురు రాజకీయాల్లో చక్కగా రాణించారు. భర్త మరణంతో రాజకీయాలకు స్వస్తిపలికి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అల్లు నెల రోజుల పాటు తిరుప్పావై ఉపన్యాసాలు, మూడు సంవత్సరాలు గీతామిషన్ లో గీతా జయంతి ఉత్సవాలలో ఉపన్యాసాలు,రాజమండ్రి, కోరుకొండ పరిసర గ్రామాలు, హైదరాబాద్,బెంగళూరు,వైజాగ్, వరంగల్,ఖమ్మం మొదలైన ప్రాంతాలలో 1000 కు పైగా శ్రీసాయి అఖండ నామ జప యజ్ఞం,సత్సంగములనిర్వహించారు.హిందూ సంస్కృతి సాంప్రదాయాల పట్ల మక్కువతో పిల్లలకు ఉచితంగా పుస్తకాలు అందజేసి హనుమాన్ చాలీసా,భగవద్గీత నేర్పించటం,పెద్దలకు ఉచితంగా విష్ణు లలితా సహస్రనామ స్తోత్రం, భగవద్గీత తిరుప్పావై, సుందరకాండ పుస్తకాలు అందజేసి నేర్పించడం,25 సంవత్సరాల క్రితం నుంచి రామజన్మభూమికి సంబంధించిన కార్యక్రమాలలో పాలు పంచుకోవటం చేస్తున్నారు.పిల్లలకు వేసవిలో క్లాస్ లు నిర్వహించి, యోగా, హిందూ ధర్మం, సత్ ప్రవర్తన గురించి తెలిపి, వారికి మల్టీ గ్రెయిన్ పౌష్టికాహారం అందించడం. మరి ముఖ్యంగా కాకినాడ, దుబాయ్,హైదరాబాద్ కు చెందిన 4గురు గురువులతో కలిసి ఫేస్బుక్, టెలిగ్రాం, వాట్సాప్ వంటి మాధ్యమాల ద్వారా మూడు ఏళ్ల నుండి ప్రతీరోజూ ఐదువేల మంది పెద్దలకు మూడు ఆవృత్తాలు భగవద్గీత నేర్పి ,చర్చా కార్యక్రమం కొనసాగిస్తున్నారు.కోరుకొండ సాయిబాబా ఆలయానికి స్థలం ఇవ్వటమే కాకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేసి, 25 సంవత్సరాలు పైగా, అన్నదానం, పారాయణలు, పర్వదినాలలో అన్న సమారాధనలు నిర్వహించి,ఎందరినో అన్నసమారాధన చేయడానికి ప్రోత్సహించేవారు. ఈ ఆధ్యాత్మిక అంశాలన్నిటిని పరిగణలోకి తీసుకొని మద్దూరి అన్నపూర్ణయ్య సేవా సమితి, ఆధ్యాత్మిక విభాగంలో అన్నపూర్ణ పురస్కారాన్ని అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అల్లు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, హిందూ ధర్మ ప్రచారానికి మరింత కృషి చేస్తానన్నారు.

## శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ఘనంగా 4వ వార్షికోత్సవం



**మొగల్తూరు, మార్చి 21(తెలుగు రాష్ట్రం విలేఖరి)**
మండల పరిధిలోని రామన్నపాలెం పంచాయతీ పరిధిలోనిపులపర్తి వారి తోటలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి4వ వార్షికోత్సవం కళ్యాణ మహోత్సవం శ్రీకృష్ణ ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగేయి. కొట్టు నాగ చింతారావు,శ్రీమతి దుర్గా సుభాషిణి దంపతులు స్వామివారికి అతి వైభవంగా ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మరియు ఆలయములో భక్తులకు ఉదయం 11 గంటల నుండి భారీ అఖండ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదనంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకుఇబ్బంది కలగకుండా శ్రీ కృష్ణ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తగిన పర్యవేక్షణ నిర్వహించారు.

## అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 23- న అడుగులుపుట్టు రైతు సాధికారా గొందికోడాపుట్టు గ్రామము నందు పశువులకు భారీ స్థాయిలో పశు వైద్య శిబిరం ఏర్పాటు పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్లతి కిషోర్ .

**పెదబయలు మర్చి 21)( తెలుగు రాష్ట్రం ప్రతి నిది )**
అల్లూరి జిల్లా పెదబయలు ఈ క్యాంపు భాగంగా పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు, అలాగే కోళ్లకు ఫౌల్ పాక్స్ టీకాలు వేయడం జరుగుతుందని . అదేవిధంగా, రైతులతో నేరుగా చర్చించి వారి పశువుల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని, అవసరమైన ఉచిత మందులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమానికి రైతులందరూ సద్వినియోగం చేసుకొవ లని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడం, అలాగే రైతులకు అవసరమైన వైద్య సహాయం అందించడం ప్రధాన లక్ష్యంగా పేర్కొంది.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 23- న అడుగులుపుట్టు రైతు సాధికారా గొందికోడాపుట్టు గ్రామము నందు పశువులకు భారీ స్థాయిలో పశు వైద్య శిబిరం ఏర్పాటు పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్లతి కిషోర్ . అల్లూరి జిల్లా పెదబయలు ఈ క్యాంపు భాగంగా పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు, అలాగే కోళ్లకు ఫౌల్ పాక్స్ టీకాలు వేయడం జరుగుతుందని . అదేవిధంగా, రైతులతో నేరుగా చర్చించి వారి పశువుల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని, అవసరమైన ఉచిత మందులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమానికి రైతులందరూ సద్వినియోగం చేసుకొవ లని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడం, అలాగే రైతులకు అవసరమైన వైద్య సహాయం అందించడం ప్రధాన లక్ష్యంగా పేర్కొంది.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## అత్యంత భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు.



**కోరుకొండ మార్చి 21 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**
స్థానిక మోతి మసీదులో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిమ్ లు అత్యంత భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.శనివారం ఉదయం ముస్లిం సోదరులు అందరూ రంజాన్ వేడుకల్లో భాగంగా ఒకరినొకరు ఆప్యాయతగా అలింగం చేసుకుంటూ మిఠాయిలు తినిపించుకొంటూ ఈద్ ముబారక్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నెలరోజులపాటు కఠోరంగా చేసిన ఉపవాస దీక్షలు శుక్రవారం రాత్రి నెలవంక దర్శనంతో ముగిసాయి.ఈ సందర్భంగా మసీదు గురువు సయ్యద్ ఇస్మాయిల్ ముస్లింలందరి చేత ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ చదివించారు. ఈ సందర్భంగా పేదలకు పిత్రదానం,మిఠాయిలు సేమియాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు షేక్ బాషా, సుభాన్ సాహెబ్, ఇర్ఫాన్, మొహుద్దీన్,మాజీ వక్ఫ్ బోర్డ్ సభ్యులు షేక్ బిజిలానీ,నవీన్,ఇబ్రహీం, భాష,సిలార్,బాబీ తదితర ముస్లిం సోదరులు, మతపెద్దలు మైనార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





https://epaper.teluguraastram.com



తెలుగురాష్ట్రం దినపత్రిక

# ముస్లిం మైనార్టీ అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి.

**-ముస్లిం సోదర, సోదరీమణులు భక్తి,శ్రద్ధలతో ఆత్మను శుద్ధి చేసుకుంటూ పేదలకు దాన ధర్మాలను చెయ్యడం పవిత్ర రంజాన్ మాసం ప్రతీక.-ఈద్గాలో పాల్గొని పార్ధనలు చేసి ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియ జేసిన మంత్రి.-రంజాన్ ముందే స్వంత నగదుతో సుమారు రూ 15 లక్షలతో రంజాన్ కానుకలు అందజేశాము.**



రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి నూజివీడు న్యూస్, మార్చి 21: తెలుగు రాష్ట్రం ప్రతినిధి.

ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలో రంజాన్ సంధర్భంగా ఈద్గాలో శనివారం ముస్లీం సోదర, సోదరీమణులతో కలిసి ప్రత్యేక పార్ధనలు చేసి పేరు పేరునా పలకరించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, ప్రేమతో మంత్రి ఆలింగనం చేసుకున్నారు. అనంతరం పేద ముస్లీం సోదర, సోదరీమణులకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి దానధర్మాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్ధసారథి మాట్లాడుతూ అభివృద్ధే అజెండగా, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు అడుగులు వేస్తుందని అన్నారు. పేద ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ, సాయం అందించి ఆదుకోవడంలో జీవితంలో ఎంతో సంతోషం కలుగు తుందన్నారు. స్వంత నగదు వెచ్చించి నూజివీడు పట్టణంలో నూజివీడు నియోజకవర్గములోని ముస్లీం సోదరులకు రంజాన్ రెండు రోజుల ముందే రంజాన్ పర్వదిన సందర్భంగా సుమారు రూ 15 లక్షలతో 15 వందల మంది ముస్లీం సోదరులకు కానుకగా నూతన వస్త్రాలను అందించి ముస్లీం సోదరులకు ముందే రంజాన్ పండుగ సంతోషాన్ని నింపామని అన్నారు. శాంతి, సహనం,పరమత సహనం, క్రమశిక్షణ, తనపై తనకు నియంత్రణ ఉపవాసం ఉండడం అది కేవలం ముస్లీం సోదరులకు మాత్రమే ప్రత్యేకం మని తెలియజేశారు. ఆపదలో ఆదుకోవడంలో ముస్లీం సోదరులు వారికి వారే సాటి అని అన్నారు. ఖురాన్ అవతరించిన రంజాన్ నెల ఎంతో పవిత్రమైనదని, ప్రతి ముస్లిం సోదరులు తన సంపాదనలో రెండున్నర శాతాన్ని పేదలకు పంచడం ద్వారా పేదవారు గొప్పవారు అని తారతమ్యం లేకుండా అందరూ కలిసి పండగని ఆనందంగా జరుపుకుంటారని తెలియజేశారు. వచ్చే బక్రీద్ కల్లా ఈద్గా పూర్తి చేసి ముస్లీం సోదరులకు అందిస్తామని తెలిపారు. ముస్లీం సోదరులు హజ్ యాత్రకు రూ 100 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం అని పేర్కొన్నారు. త్వరలో షాధీఖానా పూర్తి చేసి అన్ని సర్వహంగులతో తీర్చిదిద్ది ముస్లీం సోదరులు కళ్ళలో ఆనందం నింపుతానని అన్నారు. తల్లికి వందనం ద్వారా ముస్లీం సోదరులకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. కడప, విజయవాడ దర్గాను ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ నియమించిన షేక్ నిజాముద్దీన్ మరియు పది మంది సభ్యులతో కూడిన కమిటీ చాలా బాగా పనిచేస్తుందని వారు చాలా తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి చేసి చూపించారని కొనియాడారు. కూటమి ప్రభుత్వంలో ముస్లీం సోదరులకు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఆనాడు అబ్దుల్ కలామ్ ని రాష్ట్రపతిని చేయడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాత్ర మరువలేనిది తెలియజేసారు. యం.ఏ.షరీఫ్ శాసన మండలి చైర్మన్ చేయడం ద్వారా తెలుగుదేశం పార్టీ ముస్లీం సోదరులను అన్ని రకాలుగా రాజకీయ ప్రాముఖ్యతను ఇచ్చామని తెలిపారు. ముస్లిం సోదరులు పవిత్రస్థలం అయిన మక్కా సందర్శించడానికి కూటమి ప్రభుత్వం ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లింమైనార్టీ మత పెద్దలు, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ముస్లింమైనారిటీ సోదర, సోదరీమణులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# గూడెం పట్టణంలో నిత్యాన్నదానం జరగాలి

## -ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం, మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకుండా తాడేపల్లిగూడెం పట్టణంలోప్రతి రోజూ అన్నదానం జరగాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం నవరత్నాలు సభ్యుల ఆధ్వర్యంలో 400 శనివారాలు అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి.శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నదానం చేసే అవకాశం పూర్వజన్మ పుణ్యఫలం వల్ల వస్తుందని, ఈ మంచి కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని అన్నారు. ఆర్యవైశ్య మహిళలు సభ్యులుగా ఉన్న నవరత్నాల సంస్థ ఆధ్వర్యంలో 400 శనివారాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని వివిధ ఆలయాల్లో ఒక్కో వారం ఒక ఆలయం వద్ద అన్నదానం జరిగే విధంగా కృషి చేయాలన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నవరత్నాల మహిళలు చేపట్టిన ఈ అన్నదాన కార్యక్రమాలు నిత్యం కొనసాగే విధంగా తన వంతుగా లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. ఆర్యవైశ్య మహిళలు కరోనా సమయంలో కూడా బాధితులను ఆదుకున్నారని ప్రశంసించారు. నిజాయితీగా చేసేవాళ్ళు ఉంటే నిత్య అన్నదాన కార్యక్రమానికి విరాళాలు ఇచ్చే దాతలు చాలామంది మనపట్టణంలో ఉన్నారన్నారు. బలుసులమ్మ వారి జాతర ఒక్కరివల్ల జరిగే పని కాదని, ప్రజలందరూ ఎవరికి వారు స్వచ్ఛందంగా సహకరించడం వల్లే జాతరను వైభవంగా నిర్వహించ గలుగుతున్నామని తెలిపారు. నవరత్నాల టీమ్ ప్రతినిధి మండ పద్మావతి మాట్లాడుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఎంతో పెద్ద మనసుతో తాము అడగకుండానే తాము నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రూ లక్ష రూపాయలు విరాళం ఇవ్వటం, ఆయన గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. ఎమ్మెల్యే ఆకాంక్షమేరకు నిత్యాన్నదానం నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రామ దేవత ముత్యాలమ్మ వార్షికోత్సవం







టి నరసాపురం, మార్చి 21 ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి )

శ్రీగ్రామ దేవత ముత్యాలమ్మ వారు 12వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు శనివారం ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అఖండ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.. ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ. దాతల సహకారంతో ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించామని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో పబ్బు జయరాజు ఈడ నాగరాజు గుర్రం సత్యనారాయణ గుడిసె శ్రీను తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ మత్స్య నారాయణస్వామి జయంతి











మొగల్తూరు మార్చి 21(తెలుగు రాష్ట్రం విలేఖరి):

మండల పరిధిలోని పేరుపాలెం కనకదుర్గమ్మ బీచ్ సమీపంలోని వేంచేసియున్న శ్రీశ్రీశ్రీమత్స్య నారాయణ స్వామి, శ్రీ అష్టలక్ష్మి సమేత ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం శ్రీ మత్స్య నారాయణస్వామి వారి జయంతి సందర్భంగా మత్స్య నారాయణస్వామి, శ్రీ అష్టలక్ష్మి సమేత ఆదిలక్ష్మి అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు విఖనస స్తోత్ర పారాయణ, స్వస్తి పచనము, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కలశారాధన లు, పంచామృత అభిషేకం, ప్రధాన హోమం విశేషర్చన మరియు మత్స్య గాయత్రి మంత్రం 108 సార్లు సామూహిక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటల నుండి ఆలయములోశ్రీ విరజానంద స్వామీజీ భక్తులకు భక్తి విశేషం గురించి వివరించారు. అనంతరం భక్తులకి అన్న సమారాధన నిర్వహించారు. ఈసమారాధనలో సుమారుగా 2500 మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఉత్సాహం కమిటీ తెలిపారు. మరియు ఆదివారం ఉదయం 7:30 గంటల నుండి శ్రీ శ్రీ శ్రీఆదిలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు, పంచమృత అభిషేకం,108 తామర పువ్వులతో హోమం మరియు భక్తులకు 11 గంటల నుండి ఆలయంలో అన్న సమారాధన మరియు సోమవారం ఉదయం8 గంటల నుండి శాంతి హోమం, పూర్ణ హతి, శాంతి కళ్యాణం అనంతరం భక్తులకు అన్న సమారాధన మధ్యాహ్నం3 గంటల నుండి (గ్రామోత్సవం) రాత్రి 7 గంటలకు పవళింపు సేవ నిర్వహిస్తున్నట్లు ఉత్సాహ కమిటీ సభ్యులు తెలిపారు. మరియు ఆలయములో ప్రతి శనివారం భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# చేవెంద్ర మాజీ సర్పంచ్ కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించిన బూరగడ్డ



పెడన, తెలుగు రాష్ట్రం విలేఖరి మార్చి 21

పెడన మండలం చేవెంద్ర గ్రామ మాజీ సర్పంచ్ అంకెం వీర వెంకట సత్యనారాయణ( చినబాబు )కు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శనివారం అందించారు. చినబాబు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా 2,11, 500 రూపాయలు మంజూరయ్యాయి. దానికి సంబంధించిన చెక్కును వేదవ్యాస్ అందజేశారు. సహకరించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వేద వ్యాస్ కు మాజీ సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎక్సేంజ్ శాఖ తనిఖీలు





టి నరసాపురం, మార్చి 21 (తెలుగు రాష్ట్రం విలేకరి):

జిల్లాఎక్సైజ్ శాఖ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతలపూడి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు టీ నర్సాపురం (మం)లో కొన్ని గ్రామాల్లో దాడులు నిర్వహించారు, తిరుమల దేవి పేటలో అనగాని రాంబాబు మరియు బొల్లం రామకృష్ణ ల వద్ద రసాయన పరీక్షల నిమిత్తం కొంత కల్లు ని సేకరించారు. గ్రామంలొ మద్యం దుకాణశీ లొ తనిఖీలు నిర్వహించారు,ఈ దాడులలొ ఎక్సైజ్ ఎస్ ఐ జె జగ్గారావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# అద్భుతంగా సాగిన అఖండ దీపారాధన

తాడేపల్లిగూడెం, మార్చి21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)





తాడేపల్లిగూడెం గ్రామదేవత శ్రీశ్రీశ్రీ బలుసులమ్మ వారి జాతర మహోత్సవంలో భాగంగా నిర్వహించిన అఖండ దీపారాధన కార్యక్రమం అద్భుతంగా సాగింది. ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ దీపోత్సవంలో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి అమ్మవారి ఆలయం వరకు పట్టణ ప్రధాన విధుల్లో ఈ ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వేలాదిమంది సోదరీమణులు వివిధ ప్రాంతాల నుంచి పుట్టింటికొచ్చి అమ్మవారి అఖండ దీపోత్సవంలో పాల్గొనడం ఆనందదాయకమని అన్నారు. ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపే ఈ అఖండ దీపోత్సవం అపూర్వమని, జాతరలో అఖండ దీపారాధన, కలశాల ప్రదర్శన అద్భుతమని, అమ్మవారి ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు దిగ్విజయంగా జరుగుతున్నాయన్నారు. జాతరకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, కూటమి నాయకులు, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న వడ్డి రఘురామ్

## -ముస్లిం ఖబరిస్తాన్ అభివృద్ధికి రూ.2 లక్షల నగదు అందచేత









తాడేపల్లిగూడెం, మార్చి21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తాడేపల్లిగూడెం పట్టణంలోని పాతూరు పెద్ద మసీదు సమీపంలోని ఖబరిస్తాన్ (స్మశాన వాటిక) అభివృద్ధికి రూ 2 లక్షలు ఇస్తానని ఫిబ్రవరి 13వ జరిగిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈరోజు పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఖబరిస్తాన్ (స్మశాన వాటిక) అభివృద్ధికి పట్టణంలోని ముస్లిం షాదీ ఖానా వద్ద పెద్ద మసీదు కమిటీకి రూ.2 లక్షల నగదు అందచేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలసి రంజాన్ ప్రార్థనలో పాల్గొని వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ మాట్లాడుతూ ముస్లింలను ఎల్లప్పుడూ సొంత కుటుంబ సభ్యులుగానే భావిస్తామన్నారు. ఇదే కాకుండా వారికి ఎప్పుడు ఎటువంటి అవసరం వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున వారికి అందుబాటులో ఉంటామని భరోషానిచ్చారు. ప్రతి ఒక్కరికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పవిత్ర మాసంలో పాటించిన క్రమశిక్షణ, అలవర్చుకున్న సద్గుణాలను జీవితాంతం కొనసాగించాలని, ధర్మబద్ధమైన జీవితాన్ని కొనసాగించాలన్నారు. పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలు పలించాలని, త్యాగా లకు, మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని పేర్కొన్నారు. నెల రోజులు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు అందరూ సుఖసంతోషాలతో జీవించేలా అల్లా అనుగ్రహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాబ్ క్యాలెండర్ విడుదల హర్షనీయం

## -ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

బంటుమిల్లి తెలుగు రాష్ట్రం విలేఖరి మార్చి 21



శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ పై పెడన నియోజకవర్గం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బంటుమిల్లి మండలం అర్తమూరు గ్రామంలో ఏర్పాటుచేసిన దివంగత నేత మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి మాట నిలబెట్టుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ వంటి పారదర్శక ద్వారా నిరుద్యోగ యువతకు స్పష్టత, నమ్మకం పెరుగుతాయాని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ సమయంలోనే ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం ద్వారా యువతకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ విడుదల నిరుద్యోగ యువతకు నిజమైన ఉగాది కానుకగా నిలిచిందని అన్నారు.



# శ్రీవారి పాదసన్నిధిలో..
# సీఎం చంద్రబాబు కుటుంబం





- ప్రతీ ఏడాది మనవడు దేవాన్ష్ పుట్టిన రోజున ఒక రోజు అన్నప్రసాదానికి విరాళం
- సామాన్య భక్తునిలా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచే శ్రీవారి దర్శనం చేసుకున్న సీఎం చంద్రబాబు
- వెంగమాంబ అన్నదాన కాంప్లెక్సులో భక్తులకు అన్నప్రసాదాన్ని అందించిన సీఎం కుటుంబ సభ్యులు
- భద్రతను పక్కన పెట్టి భక్తుల వద్దకు నేరుగా వెళ్లిన సీఎం చంద్రబాబు
- తిరుమలలో సౌకర్యాలపై భక్తులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి
- లడ్డూలో నాణ్యత మెరుగైందని సీఎం చంద్రబాబుకు చెప్పిన భక్తులు
- భక్తులకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించిన కుటుంబ సభ్యులు
- తిరుమలలో ఘనంగా నారా దేవాన్ష్ జన్మదిన వేడుక



**తిరుమల, మార్చి 21 తెలుగురాష్ట్రం ప్రతినిధి**

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. తన మనవడు దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుమల విచ్చేసిన సీఎం కుటుంబం, భక్తిశ్రద్ధలతో శ్రీవారిని కొలుచుకున్నారు. ముఖ్యమంత్రి వెంట ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు, మంత్రి నారా లోకేష్, మనవడు దేవాన్ష్ ఉన్నారు. దర్శనం అనంతరం టీటీడీ వేద పండితులు సీఎం కుటుంబానికి వేదాశీర్వచనమిచ్చారు. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా సీఎం కుటుంబం ఒక రోజు అన్నదానానికి అయ్యే ఖర్చు రూ.44 లక్షలను అన్నదాన ట్రస్టుకు విరాళంగా అందజేశారు. దేవాన్ష్ పుట్టినప్పటి నుంచి ప్రతీ ఏడాది విరాళమిచ్చే సంప్రదాయాన్ని చంద్రబాబు కుటుంబం పాటిస్తోంది. దీంట్లో భాగంగా ఇప్పటివరకు 12 సార్లు విరాళమిచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో మహా ద్వారా ప్రవేశం ద్వారా నేరుగా ఆలయంలోకి వెళ్లే వెసులుబాటు ఉన్నప్పటికీ సామాన్య భక్తుని మాదిరిగానే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారానే దర్శనం చేసుకున్నారు.





తొలిసారి సీఎం అయినప్పటి నుంచి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారానే శ్రీవారి దర్శనం చేసుకుంటున్న సీఎం... ఇప్పటికీ అదే ఆనవాయితీని పాటిస్తున్నారు. ఎప్పటిలా సామాన్య భక్తుని మాదిరిగానే శ్రీవారి పట్ల తనకున్న భక్తిని చాటుకున్నారు.

**అన్న ప్రసాదం అందిస్తూ... భక్తుల సౌకర్యాలపై**

**ఆరా తీస్తూ...**

శ్రీవారి దర్శనం అనంతరం ఆలయం నుంచి కాలినడకన తరిగొండ వెంగమాంబ అన్నదాన కాంప్లెక్స్ కు వెళ్లిన సీఎం కుటుంబం, అక్కడ భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా భక్తులతో ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తిరుమల మాడ వీధుల్లో ముఖ్యమంత్రి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో భక్తులు ఆయన్ను చూసి ఉత్సాహంగా పలకరించారు. సెక్యూరిటీ ప్రోటోకాల్స్ పక్కన పెట్టి మరీ భక్తుల వద్దకు వెళ్లిన సీఎం, వారితో కరచాలనం చేస్తూ ఫోటోలు దిగారు. ఓ భక్తురాలు తన వద్దనున్న కరుంగళి మాలను సీఎంకు బహుకరించారు. దానిని ముఖ్యమంత్రి అప్యాయంగా స్వీకరించారు. లడ్డూ ప్రసాదం నాణ్యతపై భక్తుల అభిప్రాయాలను సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. లడ్డూ ప్రసాదం చాలా బాగుందని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. దర్శనం మరింత వేగంగా జరిగేలా చూడాలని భక్తులు కోరగా, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఇప్పటికే ఏర్పాటు చేశామని, త్వరలోనే ఏఐ టెక్నాలజీ ద్వారా శ్రీవారి దర్శనం మరింత సులభతరం, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.
























https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# తెలుగు సినిమా మరింత ఖ్యాతి పొందాలి




రాబోయే రోజుల్లో తెలుగు సినిమా పరిశ్రమ మరింత ఖ్యాతిని పొందాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. తెలుగు సినిమా వేదిక ఆధ్వర్యంలో ఏటేటా నిర్వహించే ఉగాది నంది పురస్కారాల ప్రదానోత్సవ వేడుక శుక్రవారం నాడు హైదరాబాద్ ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో జరిగింది. ఉగాదికి గద్దర్ అవార్డులు పొందిన 23 చిత్రాల యూనిట్ల ప్రతినిధులను ప్రత్యేకంగా ఉగాది నంది పురస్కారంతో సత్కరించారు. ఇదే వేడుకలో కోర్ట్, దండోరా, బందీ, ఆదిపర్వం, సీతా పయనం కృష్ణతో వంటి చిత్రాల్లో ప్రతిభ కనబరిచిన ఆదిత్య ఓం, జెమినీ సురేష్, శుభోదయం సుబ్బారావు, సంజయ మేగోటి, రఘు, రోజా భారతిలతో పాటు సామాజిక రంగానికి చెందిన విజయ లక్ష్మి, చెరుకూరి ప్రసాద్‌రాజు, నర్సింగ్‌గౌడ్‌లను ఉగాది నంది పురస్కారంతో సత్కరించారు. సోలో క్యారెక్టర్‌తో బందీ చిత్రంలో అద్భుత ప్రతిభను కనబరిచిన ఆదిత్య ఓంని చిత్రపరిశ్రమ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఉప సభాపతి రామచంద్ర నాయక్, సీనియర్ నటులు మాగంటి మురళీమోహన్, నటుడు పృథ్వీరాజ్, ప్రముఖ దర్శకులు ఎస్వి కృష్ణారెడ్డి, దర్శకుల సంఘం అధ్యక్షులు వీఎన్ ఆదిత్య, తెలుగు సినిమా నిర్మాతల మండలి అధ్యక్షులు దామోదర్‌ప్రసాద్, నిర్మాతలు కె.అచ్చిరెడ్డి, విజయకుమార్ వర్మ, నటుడు రాంకీ, పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఫిట్నెస్ గురు అనుప్రసాద్ సత్కరించిన వారిలో ఉన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యులు రాయపాటి సాంబశివరావు మనవడు 23 చిత్రంతో అరంగేట్రం చెయ్యడం సంతోషదాయకమని పేర్కొన్నారు. విజయ వర్మ పాకలపాటి తన తెలుగు సినిమా వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సినీ రంగానికి విశేష సేవలు అందిస్తున్న జెవి మోహన్‌గౌడ్‌కు సినీ సాఫల్యతా పురస్కారాన్ని అందజేశారు. రమేష్ మిమిక్రీతో ఆకట్టుకున్నాడు. విజయ మాధవి అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## మూడో రోజు కూడా ధురంధర్-2 కలెక్షన్ల జోరు

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. మార్చి 19న విడుదలైన ఈ స్పై థ్రిల్లర్, కేవలం మూడు రోజుల్లోనే దేశవ్యాప్తంగా సుమారు రూ.260 కోట్ల నెట్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతోంది. విడుదలకు ముందే పెయిడ్ ప్రీవ్యూల ద్వారా రూ.43 కోట్లు రాబట్టిన ఈ సినిమా, తొలిరోజైన గురువారం ఏకంగా రూ.102.55 కోట్లు వసూలు చేసి బాలీవుడ్‌లో అత్యధిక ఓపెనింగ్ డే కలెక్షన్ల రికార్డు సృష్టించింది. రెండో రోజు (శుక్రవారం) రూ.80.72 కోట్లు సాధించగా, మూడో రోజైన శనివారం సాయంత్రానికే రూ.87 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. దీంతో తొలి మూడు రోజుల్లోనే ఈ చిత్రం రూ. 260 కోట్ల మార్కును దాటింది. ఈ వసూళ్లతో రణ్‌బీర్ కపూర్ నటించిన 'యానిమల్' సినిమా ఓపెనింగ్ వీకెండ్ రికార్డును 'ధురంధర్ 2' సునాయాసంగా అధిగమించినట్లు ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పాజిటివ్ టాక్, వీకెండ్ కావడంతో థియేటర్ల ఆక్యుపెన్సీ శనివారం నాడు 78 శాతానికి పైగా నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా కూడా ఈ చిత్రం తొలి రెండు రోజుల్లోనే రూ.333 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లను సాధించి సత్తా చాటింది. ఈ వసూళ్లలో హిందీ వెర్షన్ సింహభాగం వాటాను దక్కించుకోగా, తెలుగు, తమిళ భాషల్లోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రణ్‌వీర్ 'జస్కీరత్ సింగ్ రంగి' అనే స్పై పాత్రలో కనిపించారు. ప్రస్తుత ట్రెండ్ చూస్తుంటే, రానున్న రోజుల్లో ఈ సినిమా మరిన్ని బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.





## నా ఆస్కార్ కల.. త్రివిక్రమ్‌తోనే సాధ్యం: థమన్



టాలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. భవిష్యత్తులో తాను కచ్చితంగా ఆస్కార్ అవార్డు సాధిస్తానని, అది కూడా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలోనే సాధ్యమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన థమన్... ఏఆర్ రెహమాన్ 'స్లమ్‌డాగ్ మిలియనీర్'తో ఆస్కార్ గెలిచి దారి చూపారని, ఆ తర్వాత రాజమౌళి, కీరవాణి 'ఆర్ఆర్ఆర్'తో దాన్ని మన ముందుకు తీసుకొచ్చారని అన్నారు. వారి స్ఫూర్తితోనే తాను కూడా ఆస్కార్ వేదికపై నిలబడాలని కల కంటున్నట్లు తెలిపారు. త్రివిక్రమ్ ఆలోచనా విధానానికి, ఆయన కథలకు ఆస్కార్ స్థాయి ఉందని ప్రశంసించారు. ముఖ్యంగా త్రివిక్రమ్ వద్ద వందేళ్లపాటు గుర్తుండిపోయేలా ఓ అద్భుతమైన 'రామాయణం' స్క్రిప్ట్ సిద్ధంగా ఉందని, ఆ సినిమాతో తమ ఆస్కార్ కల నెరవేరుతుందనే నమ్మకాన్ని థమన్ వ్యక్తం చేశారు. అయితే, ఆయన వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి భిన్న స్పందనలు వస్తున్నాయి. ఆయన ఆత్మవిశ్వాసాన్ని కొందరు మెచ్చుకుంటుంటే, మరికొందరు మాత్రం అతిశయోక్తి అంటూ సెటైర్లు వేస్తున్నారు. దీంతో ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. త్రివిక్రమ్‌ను తన గురువుగా భావించే థమన్, ఆయనతో కలిసి తన కలను నిజం చేసుకుంటారో లేదో కాలమే నిర్ణయించాలి.

## దర్శకులను సూపర్‌స్టార్లు తొక్కేస్తున్నారు

### కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు



వివాదాస్పద అంశాలపై కూడా సూటిగా, స్పష్టంగా తన అభిప్రాయాలను వెల్లడించే నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతీయ సినీ పరిశ్రమలో సూపర్‌స్టార్లు ఫిల్మ్‌మేకర్లను వేధిస్తారని, వారిని బెదిరింపులకు గురిచేస్తారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఈ విషయంపై ఆమె గళం విప్పారు. హాలీవుడ్‌లో ప్రముఖ నటుల కంటే దర్శకులకే ఎక్కువ పేరు, గౌరవం ఉంటాయని, కానీ బాలీవుడ్‌లో పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఘన విజయం సాధించిన 'ధురంధర్ 2' చిత్రం సందర్భంగా దర్శకుడు ఆదిత్య ధర్‌ను ప్రశంసిస్తూ కంగనా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక సుదీర్ఘమైన నోట్ రాశారు. భారతీయ చిత్ర పరిశ్రమలో దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులు తీవ్రమైన శ్రమకు గురవుతారని, కానీ వారికి సరైన పారితోషికం గానీ, గుర్తింపు గానీ లభించడం లేదని ఆమె పేర్కొన్నారు. “ధురంధర్ విజయంలో గొప్ప విషయం ఏమిటంటే, ఆదిత్య ధర్ ఒక సూపర్‌స్టార్ డైరెక్టర్‌గా స్థిరపడటం. స్పీల్‌బర్గ్, టరంటినో, నోలన్ వంటి హాలీవుడ్ సూపర్‌స్టార్ దర్శకులకు ఎప్పుడూ అక్కడి నటుల కన్నా అధిక ప్రాధాన్యత ఉంటుంది. కానీ మనం మన ఫిల్మ్‌మేకర్లకు తగినంత గౌరవం ఇవ్వం” అని కంగనా వ్యాఖ్యానించారు. “దర్శకులు అధిక శ్రమకు గురవుతూ, తక్కువ వేతనం పొందుతూ సూపర్‌స్టార్ల చేతిలో వేధింపులకు గురవుతున్నారు. దీని ఫలితంగానే, ఫిల్మ్‌మేకర్ కావాలని లేదా సినిమాటోగ్రాఫర్ అవ్వాలని కలలు కనే యువతను నేను ఎప్పుడూ కలవలేదు. ప్రతి ఒక్కరూ తమకు టాలెంట్ ఉందని చెప్పుకుంటారు, కానీ అందరూ నటులు కావాలనే కోరుకుంటారు. ఇక్కడ ఏ హీరో కన్నా ప్రకాశవంతంగా వెలిగిపోతున్న ఒక సూపర్‌స్టార్ ఫిల్మ్‌మేకర్ (ఆదిత్య ధర్) ఉన్నారు. ఇప్పుడు ఎందరో యువకులు ఆయన కథను చూసి, ఆయనలాగే ఎదగాలని ఆకాంక్షిస్తారు. సినీ పరిశ్రమను ఉన్నత శిఖరాలకు తీసుకెళతారు. ఆదిత్య ధర్... మీకు నా వందనాలు” అని కంగనా తన పోస్టులో రాసుకొచ్చారు. ఈ పోస్టులో దర్శకుడు ఆదిత్య ధర్‌పై ప్రశంసల వర్షం కురిపించిన కంగనా, చిత్ర కథానాయకుడు రణ్‌వీర్ సింగ్‌ను గానీ, ఇతర నటీనటులను గానీ ట్యాగ్ చేయకపోవడం గమనార్హం.

## బిచ్చగాడు' కాంబోలో 'వంద దేవుళ్లు'

విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబోలో 'వంద దేవుళ్లు' అనే చిత్రం రాబోతోంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. తాజాగా విష్ణు మంచు ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. ఈ మూవీకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబోలో 'బిచ్చగాడు' తెరకెక్కింది.




## యాక్షన్ లెజెండ్ చక్ నోరిస్ కన్నుమూత



ప్రపంచ ప్రఖ్యాత యాక్షన్ హీరో, మార్షల్ ఆర్ట్స్ దిగ్గజం చక్ నోరిస్ (86) కన్నుమూశారు. తన యాక్షన్ చిత్రాలతో, పోరాట నైపుణ్యంతో తరతరాల ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఆయన, తన కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రశాంతంగా తుది శ్వాస విడిచినట్టు సన్నిహితులు వెల్లడించారు. ఆయన మరణం హఠాత్తుగా సంభవించినప్పటికీ, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండానే ఆయన నిష్క్రమించారు. సినిమా తెరపై అసాధ్యుడు అనే పదానికి చక్ నోరిస్ చిరునామాగా నిలిచారు. బ్రూస్ లీతో రోమ్ కొలోసియంలో ఆయన చేసిన పోరాట ఘట్టం సినిమా చరిత్రలోనే ఒక మైలురాయి. 'మిస్సింగ్ ఇన్ యాక్షన్', 'ది డెల్టా ఫోర్స్' వంటి చిత్రాలతో యాక్షన్ హీరోగా తిరుగులేని స్టార్‌డమ్ సంపాదించారు. ముఖ్యంగా 'వాకర్, టెక్సాస్ రేంజర్' టీవీ సిరీస్‌తో ఆయన ప్రతి ఇంటికీ చేరువయ్యారు. అమెరికన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేస్తున్నప్పుడు కొరియాలో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న ఆయన, ఆరుసార్లు ప్రపంచ కరాటే ఛాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించారు. సినిమాలతో పాటు, ఇంటర్నెట్ ప్రపంచంలోనూ చక్ నోరిస్ ఒక సంచలనం. ఆయన బలంపై పుట్టుకొచ్చిన “చక్ నోరిస్ ఫ్యాక్ట్స్” అనే జోకులు, మీమ్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. ఈ జోకులను ఆయన కూడా సరదాగా స్వీకరించేవారు. కొద్ది రోజుల క్రితం తన 86వ పుట్టినరోజు సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక స్పారింగ్ వీడియో పోస్ట్ చేస్తూ.. “నేను ముసలివాడిని అవ్వను.. లెవల్ అప్ అవుతాను” అని రాశారు. ఆయన చెప్పినట్టుగానే, భౌతికంగా దూరమైనా ఒక లెజెండ్‌గా సినీ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతారు.

## 'రాకాస'తో వస్తున్న కొణిదెల నిహారిక..

### మళ్లీ మేకప్ వేసుకోవడానికి రెడీ అని వెల్లడి



మెగా ఫ్యామిలీ నుంచి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి, ఆ తర్వాత నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నిహారిక కొణిదెల ఇప్పుడు ఫుల్ జోష్‌లో ఉన్నారు. 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై ఆమె నిర్మించిన 'కమిటీ కుర్రాళ్ళు' భారీ విజయం సాధించడంతో, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'రాకాస'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. సంగీత్ శోభన్ హీరోగా నటించిన ఈ చిత్రంపై నిహారిక ధీమాగా ఉన్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 3న థియేటర్లలో సందడి చేయనుంది. ఇది ఒక 'హర్రర్ కామెడీ ప్లస్ ఫాంటసీ' జానర్‌లో తెరకెక్కిన సినిమా. కుటుంబ సభ్యులందరూ కలిసి చూసేలా క్లీన్ ఎంటర్‌టైనర్‌గా దీనిని రూపొందించామని నిహారిక తెలిపారు. ఇప్పటికే సంగీత్ శోభన్‌తో 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ' వంటి హిట్ వెబ్ సిరీస్ నిహారిక నిర్మించారు. ఇప్పుడు అదే కాంబోలో సినిమాతో వస్తుండటం విశేషం. ప్రస్తుతం నటనకు దూరంగా ఉన్న నిహారిక, మళ్ళీ మేకప్ వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తాజాగా ప్రమోషన్లలో ఆమె మాట్లాడుతూ తన సెకండ్ ఇన్నింగ్స్ గురించి క్లారిటీ ఇచ్చారు. గత కొంతకాలంగా అనేక కథలు వింటున్నానని, అందులో కొన్ని స్క్రిప్ట్స్ తనకు బాగా నచ్చాయని చెప్పారు. అన్నీ కుదిరితే 2027లో మళ్ళీ హీరోయిన్‌గా వెండితెరపై కనిపించే అవకాశం ఉందని ఈ మెగా ముద్దుగుమ్మ వెల్లడించారు.

## 'శంబాల' టీమ్‌తో సందీప్ కిషన్ కొత్త చిత్రం...

### పాన్ ఇండియా స్థాయిలో మూవీ




యంగ్ హీరో సందీప్ కిషన్ తన తదుపరి చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. తన కెరీర్‌లో 33వ సినిమాగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కు (చూఖ33) 'శంబాల' ఫేమ్ యుగంధర్ ముని దర్శకత్వం వహించనున్నారు. సూపర్‌హిట్ చిత్రం 'శంబాల'ను నిర్మించిన షైనింగ్ పిక్చర్స్ సంస్థ ఈ మైథలాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ విషయాన్ని సందీప్ కిషన్ శనివారం తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. “సింహాలు, తోడేళ్లు, రాజులు, కత్తులతో మన పురాణాల్లోకి ఒక సాహసోపేత ప్రయాణం” అంటూ సందీప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని రేపుతోంది. ఒకవైపు గర్జిస్తున్న సింహం, మరోవైపు తోడేలు, వాటి మధ్యలో నేలపై పాతిన కత్తితో ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. “కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొందరు రాజులు ఎప్పటికీ చనిపోరు” అనే ట్యాగ్‌లైన్ సినిమా కథాంశంపై అంచనాలను పెంచుతోంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల చేయనున్నారు. ఇదిలా ఉండగా, సందీప్ కిషన్ ప్రస్తుతం పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. వాటిలో 'సిగ్మా' ఒకటి. ప్రముఖ తమిళ నటుడు విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతుండటంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. యాక్షన్-అడ్వెంచర్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సందీప్ సరసన ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. నిధి వేట నేపథ్యంలో సాగే ఈ కథలో కేథరిన్ ట్రెసా ఓ ప్రత్యేక గీతంలో కనిపించనుంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339